ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

3

విశాఖపట్నం

జిల్లా వార్తలు

శనివారం 2 ఆగస్టు 2025



93.55% మందికి పింఛన్లు పంపిణీ

భీమునిపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1,60,778 మందికిగాను శుక్రవారం 1,50,448 మందికి (93.55 శాతం) పింఛన్లు పంపిణీ చేశారు. నగరంలో 1,34,090 మందికిగాను 1,25,245 మందికి, నాలుగు గ్రామీణ మండలాల్లో 26,688మందికి గాను 25,134 మందికి పింఛన్లు అందజేశారు.



భీమునిపట్నంలోని గొల్లవీధిలో పింఛను పంపిణీ చేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

---

5 ఐటీ సంస్థలకు భూ కేటాయింపులు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విశాఖను ఐటీ హబ్‌గా మార్చాలని పలు సంస్థలకు ఇక్కడ భూములు కేటాయిస్తూ వారం క్రితం రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. వాటిపై శుక్రవారం ప్రత్యేకంగా జీఓలు జారీ చేసింది. మొత్తం ఐదు సంస్థలకు భారీగా భూములు ఇచ్చింది. కొన్నింటికి మూడేళ్లలో ఆపరేషన్లు ప్రారంభించాలనే నిబంధన పెట్టింది. కొందరికి ఎకరా రూ.50 లక్షలకు, మరికొందరికి రూ.1.5 కోట్లకు, ఇంకొందరికి రూ.4.05 కోట్ల చొప్పున ధర నిర్ణయించింది. ఒక సంస్థకు ఎకరా 99 పైసలకే ఇవ్వడం గమనార్హం.



రుషికొండ ఐటీ హిల్స్

- రుషికొండ, మధురవాడల్లో ఏఎన్ఎస్ఆర్‌కు 10.29 ఎకరాలు
- రూ.1,000 కోట్ల పెట్టుబడి, పది వేల మందికి ఉద్యోగాలు
- సిఫీ ఇన్ఫినిటీ స్పేస్‌కు రుషికొండ, పరదేశిపాలెంలలో 53.6 ఎకరాలు
- పెట్టుబడి రూ.15,266 కోట్లు
- బీవీఎం ఎనర్జీకి పనోరమ హిల్స్ వద్ద 30 ఎకరాలు
- వరల్డ్ ట్రేడ్ సెంటర్, స్టార్ హోటల్ నిర్మాణం
- ఫీనమ్ పీపుల్స్‌కు 4.45 ఎకరాలు

• ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థకు కేవలం 99 పైసలకు ఎకరా భూమి ఇచ్చారు. రుషికొండ హిల్ నంబరు 3లో 2.5 ఎకరాలు, మధురవాడ హిల్ నంబరు 4లో 7.79 ఎకరాలు కేటాయించారు. వీరి పెట్టుబడి రూ.వేయి కోట్లు. పది వేల మందికి ఉద్యోగాలు ఇవ్వాలి. ప్రధాన కార్యాలయం నిర్మించి మూడేళ్లలో ఆపరేషన్లు ప్రారంభించాలని నిబంధన పెట్టారు. ఇక్కడ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు చెందిన సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ వస్తుంది.

సత్వ డెవలపర్స్‌కు 30 ఎకరాలు

సత్వ డెవలపర్స్‌కు ఐటీ స్పేస్, డేటా సెంటర్ ఏర్పాటు కోసం మధురవాడలోని హిల్ నంబరు 4లో 30 ఎకరాలు, ఎకరా రూ.1.5 కోట్లు చొప్పున ఇచ్చారు. వీరు రూ.1,500 కోట్ల పెట్టుబడితోనే 25 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మూడేళ్లలో 10 లక్షల చ.అ. స్థలం, ఐదేళ్లలో 90 లక్షల చ.అ. నిర్మాణం పూర్తిచేయాలి.

• సిఫీ ఇన్ఫినిటీ స్పేస్ లిమిటెడ్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తుంది. వీరికి రుషికొండ హిల్ నంబరు 3లో 3.6 ఎకరాలు ఎకరా కోటి రూపాయలకు ఇచ్చారు. పరదేశిపాలెంలో 50 ఎకరాలు కేటాయించారు. వీరి పెట్టుబడి రూ.15,266 కోట్లు కాగా ఇచ్చే ఉద్యోగాలు 600. రెండేళ్లలో ఆపరేషన్లు ప్రారంభించాలి. పరదేశిపాలెం సర్వే నంబరు 134లో ముందుగా 25 ఎకరాలు ఎకరా రూ.50 లక్షలకు ఇచ్చారు.

• కపిల్ చిట్‌ఫండ్ గ్రూపునకు ... మిగతా 4వ పేజీలో

ఎంఐజీ లేఅవుట్లకు కొరవడిన ఆదరణ

ఆరు లేఅవుట్లలో అమ్మకానికి 2,468 ప్లాట్లు

- ఇప్పటివరకూ అమ్ముడైనవి కేవలం 468 మాత్రమే
- మిగిలిన 2,000 ప్లాట్లు వేలం ద్వారా విక్రయం
- ప్రభుత్వ కొత్త మార్గదర్శకాలు జారీ
- ప్రజా సంఘాల అభ్యంతరం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మధ్య తరగతి ప్రజల పేరు చెప్పి రాష్ట్ర ప్రభుత్వాలు లేఅవుట్లు వేయడం, వాటికి ఆదరణ కొరవడి మధ్యలో ఆగిపోవడం, ఆ తరువాత వాటిని అధిక రేట్లకు అమ్ముకొని ప్రభుత్వం లాభపడడం ఆనవాయితీగా వస్తోంది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు 'రాజీవ్ స్వగృహ' పేరుతో మధ్య తరగతికి ఫ్లాట్లు నిర్మిస్తామంటూ ఎండాడలో పనులు మొదలెట్టారు. అది మధ్యలో ఆగిపోయింది. ఆ భూములను ఆయన కుమారుడు జగన్మోహన్‌రెడ్డి ప్లాట్లుగా విభజించి వేలం ద్వారా కోట్ల రూపాయలకు అమ్ముకొని ఖజానా నింపుకొన్నారు. జగన్ హయాంలో మళ్లీ మధ్య తరగతి ప్రజల కోసం అంటూ వీఎంఆర్‌డీఏతో 'ఎంఐజీ లేఅవుట్లు' వేయించారు. వాటికీ ఆశించిన ఆదరణ లభించలేదు. ఇప్పుడు వాటిని వేలం ద్వారా విక్రయించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.

వైసీపీ హయాంలో నాలుగేళ్ల క్రితం మధ్య తరగతి ప్రజల కోసం వీఎంఆర్‌డీఏ ద్వారా ఆరు లేఅవుట్లు వేయించారు. ఆనందపురం మండలం పాలవలస, రామవరం, గంగసాని అగ్రహారం-1, గంగసాని అగ్రహారం-2, విజయనగరం జిల్లా గరివిడి, అనకాపల్లి జిల్లా అడ్డూరుల్లో వీటిని వేశారు. వాటిలో 150 గజాలు, 200 గజాలు, 240 గజాలు ప్లాట్లు వేశారు. వాటిని అమ్మకానికి పెట్టారు. ఏడాదికి రూ.18 లక్షల ఆదాయం దాటని వారు మాత్రమే దరఖాస్తు చేయాలనే నిబంధన పెట్టారు. ఒక కుటుంబానికి ఒకటి మాత్రమే కేటాయిస్తామని స్పష్టం చేశారు. దరఖాస్తుదారులకు నచ్చిన ప్లాటు ఎంపిక చేసుకునే అవకాశం ఇవ్వలేదు. దరఖాస్తులన్నీ స్వీకరించి లాటరీ వేస్తామని, అందులో ఏది వస్తే అదే తీసుకోవాలని పేర్కొన్నారు. దాంతో చాలామంది ఆసక్తి చూపించలేదు. లక్షల రూపాయలు పెట్టి కొనే ప్లాటు వాస్తు ప్రకారం ... మిగతా 4వ పేజీలో

ఆనందపురం మండలం పాలవలసలో ఎంఐజీ లేఅవుట్





అడ్డూరులో ఎంఐజీ లేఅవుట్

ఇవీ ఖాళీలు

లేఅవుట్	మొత్తం ప్లాట్లు	కేటాయించినవి	మిగులు ప్లాట్లు
పాలవలస	472	435	37
రామవరం	763	----	763
జీఎస్ అగ్రహారం-1	619	----	619
జీఎస్ అగ్రహారం-2	257	----	257
గరివిడి	211	3	208
అడ్డూరు	146	30	116
మొత్తం	2,468	468	2,000

అమ్మో.. హోటల్ ఫుడ్!

రోజుల తరబడి నిల్వ ఉంచిన ఆహార పదార్థాల విక్రయం



- నగరంలోని అనేక హోటళ్లు, రెస్టారెంట్స్‌లో దారుణం
- ఆహార భద్రత, ప్రమాణాల శాఖ దాడుల్లో గుర్తింపు
- మూడు నుంచి ఐదు రోజులు ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన పదార్థాలు చూసి అధికారులు షాక్
- చికెన్, మటన్, చేపలు, రొయ్యలు అన్నీ అంతే
- కొన్నిరకాల పేస్టులు, గ్రేవీలు, కర్రీలు కూడా
- హానికారక రంగులు వినియోగం
- 20 బృందాలతో 40 చోట్ల తనిఖీలు
- 24 కేసులు నమోదు చేసిన అధికారులు
- నేడూ కొనసాగనున్న దాడులు

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): "రోజుల తరబడి నిల్వ ఉంచిన చికెన్, మటన్, రొయ్య, చేప వంటకాలు. కుళ్లిపోయిన గుడ్లు. దుర్వాసన వస్తున్న న్యూడిల్స్, వంటలకు వినియోగించే పేస్టులు"...

ఇవీ నగరంలోని అనేక హోటల్స్ రెస్టారెంట్స్‌లో కనిపించిన దృశ్యాలు. పేరుమోసిన హోటల్స్, రెస్టారెంట్స్‌లోనూ ఈ పరిస్థితులు ... మిగతా 4వ పేజీలో



హోటల్‌లో నిల్వ ఉంచిన పదార్థాలు

తనిఖీ చేసిన హోటల్స్ ఇవే...

సనపరా హోటల్ అండ్ రిసార్ట్, బీచ్ రోడ్డులోని ప్యారడైజ్ ఫుడ్‌కోర్ట్, అంబికా సీగ్రీన్, శ్రీకామత్ హోటల్, లాసన్స్‌బే కాలనీలోని పంచభక్ష, ఎంవీపీ కాలనీలోని దేశి విలేజ్ హాస్పిటాలిటీ ప్రైవేటు లిమిటెడ్, డైనీ డెస్టినీ ఫైన్ డైనింగ్ రెస్టారెంట్స్, ఎండాడలోని కళింగ రెస్టారెంట్, మధురవాడలోని జీషన్ రెస్టారెంట్, జగదాంబ జంక్షన్ సమీపంలోని జీషన్ రెస్టారెంట్, సిరిపురంలోని దక్షిన్ కిచెన్, రుషికొండ సమీపంలోని సంసిద్ధ హాస్పిటాలిటీ, ఎండాడ, వీఐపీ మెయిన్ రోడ్డులోని సోమన రెస్టో కేఫ్, పీఎం పాలెంలోని స్వగ్రామ ఫుడ్ కోర్ట్, క్రికెట్ స్టేడియం దగ్గరలోని జేఎం ఫన్ అండ్ డైన్ ప్రైవేటు లిమిటెడ్, ఎండాడలోని హోటల్ జాస్, పీఎం పాలెంలోని రాజాస్ కిచెన్, పెదవాల్తేరులోని షై రెస్టారెంట్, కృష్ణా కాలేజీ రోడ్డులోని జీషన్ రెస్టారెంట్, నగరంలోని ఈటర్స్ స్టాప్, ప్యారడైజ్, దీపక్ పంజాబీ దాబా, జగదాంబ జంక్షన్ సమీపంలోని హేలాపురి, గవర్నర్ బంగ్లా ఎదురుగా ఉన్న ప్లాట్‌ఫామ్ 65, మద్దిలపాలెంలోని అరేబియన్ నైట్స్, లలిత కిచెన్, ఎంవీపీ కాలనీలోని బాలాజీ ఈటర్స్‌స్టాప్, ఇసుకతోటలోని మాయ, ముంతాజ్, ఎన్ఏడీ జంక్షన్ సమీపంలోని దాబా సిటీ పంజాబీ, గాజువాకలోని ఆస్వాద్ లంచ్ అండ్ డిన్నర్, బన్నీస్ రెస్టారెంట్, గాజువాకలోని గ్రాండ్ ఆల్ఫా హోటల్, జీషన్ రెస్టారెంట్, రామ్‌నగర్‌లోని బాంబే రెస్టారెంట్, సరస్వతి పార్కు సమీపంలోని అల్కాపూర్ ఫ్యామిలీ రెస్టారెంట్, జగదాంబ కమర్షియల్ కాంప్లెక్స్‌లోని ఆల్ఫా హోటల్, సిరిపురంలోని ఫ్యూజన్ ఫుడ్స్ ది స్పైసీ వెన్యూ రెస్టారెంట్, స్టోన్ వెల్వెర్ బ్రేవర్స్

నేడు అన్నదాత సుఖీభవ సొమ్ములు జమ

- ఐదేసి వేల చొప్పున ఇవ్వనున్న కూటమి ప్రభుత్వం
- జిల్లాలో 18,573 మంది రైతులకు ప్రయోజనం
- పీఎం కిసాన్ కింద 18,100 మందికి రూ.రెండు వేల వంతున...



విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లాలో 18,573 మంది రైతుల ఖాతాలకు శనివారం రూ.ఐదు వేల వంతున జమ కానున్నది. ఇంకా కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం కిసాన్ పథకం కింద 18,100 మంది రైతుల ఖాతాలకు రూ.రెండు వేల వంతున జమ కానున్నది. కేంద్రం ఏటా రూ.6 వేలు మూడు విడతలుగా రైతులకు అందజేస్తున్నది. ఇక రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రూ.14 వేలు అందజేయనున్నది. తొలి విడత రూ.ఐదు వేలు శనివారం జమ చేస్తోంది. రెండో విడతలో రూ.ఐదు వేలు డిసెంబరు నెలలో, చివరి విడతగా రూ.నాలుగు వేలు వచ్చే ఏడాది మార్చి నెలలో రైతుల ఖాతాకు జమ చేయనున్నట్టు ప్రకటించింది. ఏడాదికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.20 వేలు ఇవ్వనున్నాయి. విశాఖ జిల్లాలో అన్నదాత సుఖీభవ కింద 18,573 మంది రైతులకు రూ.9.28 కోట్లు, పీఎం కిసాన్ కింద 18,100 మందికి రూ.3.62 కోట్లు...మొత్తం రూ.12.9 కోట్లు జమ కానున్నది. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులు భీమిలి నియోజకవర్గంలో 14,981 మంది, పెందుర్తిలో 3,126 మంది, గాజువాకలో 466 మంది ఉన్నారు. పీఎం కిసాన్ పథకానికి భీమిలి నియోజకవర్గంలో 13,972 మంది, పెందుర్తిలో 3,486 మంది, గాజువాకలో 577 మంది, విశాఖ పశ్చిమలో 35 మంది, తూర్పులో తొమ్మిది మంది, విశాఖ ఉత్తరంలో 21 మంది అర్హులు ఉన్నారు. పథకం ప్రారంభంలో భాగంగా భీమిలి నియోజకవర్గ పరిధిలోని పద్మనాభం మండలం పాండ్రంకి, పెందుర్తిలో సబ్బవరంలో రైతులతో సమావేశం ఏర్పాటుచేయాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే సొమ్ములు శనివారం నుంచి రైతుల ఖాతాకు జమ అవుతాయని జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.అప్పలస్వామి తెలిపారు.

అనుమతి లేని ఫెర్టిలిటీ సెంటర్లపై చర్యలు

ఐవీఎస్ సెంటర్ల తనిఖీకి ప్రత్యేక బృందాలు

- జిల్లాలో మాతా, శిశు మరణాలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టండి
- అబార్షన్లు అధికంగా చేస్తున్న ఆస్పత్రులపై నిఘా పెట్టండి
- వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశం

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఫెర్టిలిటీ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఐవీఎఫ్ సెంటర్లపై నిఘా పెట్టాలని, తనిఖీకి ప్రత్యేక టీమ్‌లను నియమించాలన్నారు.

కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన శుక్రవారం మాతా, శిశు మరణాలు, వ్యాధి నిరోధక టీకాలు, మలేరియా, డెంగ్యూ తదితర అంశాలపై ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐవీఎఫ్ సెంటర్లలో అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా మాతా, శిశు మరణాలు చోటుచేసుకోకుండా చూడాలన్నారు. నూతన దంపతులు, గర్భిణులు, శిశువుల రిజిస్ట్రేషన్లు సక్రమంగా జరిగేలా చూసుకోవాలన్నారు. హైరిస్క్ కేసులను ముందుగా ఆస్పత్రులకు తరలించాలన్నారు. అవసరమైనచోట ఆశ వర్కర్లు, ఎన్ఎంలకు తగిన తర్ఫీదు ఇవ్వాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావుకు సూచించారు. అబార్షన్లు అధికంగా చేస్తున్న ఆస్పత్రులపై నిఘా పెట్టాలని, అందుకు గల కారణాలపై నివేదిక ఇవ్వాలన్నారు. శిశువులకు వ్యాక్సిన్లు సకాలంలో అందించాలన్నారు. మలేరియా, డెంగ్యూ నివారణకు ప్రతి శుక్రవారం ... మిగతా 4వ పేజీలో



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మూడో ఉచిత సిలిండర్...

- అర్హులైనవారంతా బుక్ చేసుకోవచ్చు
- నవంబరు నెలాఖరు వరకూ అవకాశం
- మొదటి రెండు దశల్లో 97.17 శాతం మంది వినియోగం

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): దీపం-2 పథకం కింద అర్హులైన గ్యాస్ వినియోగదారులకు ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని కూటమి ఎన్నికల సమయంలో ప్రకటించింది. ఆ మేరకు ఇప్పటికి రెండుసార్లు పంపిణీ చేసింది. మూడో దశ బుకింగ్ శుక్రవారం నుంచి మొదలైంది. జిల్లాలో 3.77 లక్షల మంది అర్హులు ఉన్నారు. వీరంతా మూడో విడత ఉచిత సిలిండర్ శుక్రవారం నుంచి నవంబరు నెలాఖరు వరకూ బుక్ చేసుకోవచ్చు. లబ్ధిదారుల ఖాతాలకు డబ్బులు జమ అవుతాయి. గత ఏడాది ఈ పథకం ప్రారంభించినప్పుడు జిల్లాలో 3,77,696 మంది లబ్ధిదారులు ఉండగా వారిలో 3,70,549 మంది (98.1 శాతం) ఉచిత సిలిండర్ సదుపాయాన్ని వినియోగించుకున్నారు. వారి ఖాతాలకు రూ.29.36 కోట్లు జమ చేశారు. రెండో విడత ఈ ఏడాది ఏప్రిల్‌లో జిల్లాలో వినియోగదారులు 3,71,932 మంది కాగా వారిలో 3,58,007 (96.25 శాతం) మంది సిలిండర్లు బుక్ చేసుకోగా, రూ.29.92 కోట్లు జమ అయ్యింది. మొదటి, రెండో విడత కలిపి 97.17 శాతం మంది వినియోగించుకున్నారు. కాగా మూడో విడతలో ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని లబ్ధిదారులంతా వినియోగించుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి వి.భాస్కర్ తెలిపారు.

సంక్షేమ హాస్టళ్లు కళకళ

- బీసీ, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో భారీగా చేరిన విద్యార్థులు
- పీజీ, డిగ్రీ ప్రవేశాలు ప్రారంభమైతే మరింత మంది పెరిగే అవకాశం

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు కళకళలాడుతున్నాయి. బీసీ, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు భారీ సంఖ్యలో చేరారు. ఒక్కో వసతి గృహంలో 50 నుంచి 80మందికిపైగా విద్యార్థులు చేరారు. డిగ్రీ, పీజీ ప్రవేశాలు ప్రారంభమైన తరువాత మరింత మంది వసతి గృహాల్లో చేరే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 23హాస్టళ్లు ఉండగా, వీటిలో ఎనిమిది ప్రీ మెట్రిక్, ఐదు పోస్టు మెట్రిక్ హాస్టళ్లు. ఈ హాస్టళ్లలో ప్రస్తుతం 2,067 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 814 మంది ఈ ఏడాది చేరినవారు. అలాగే బీసీ సంక్షేమ శాఖ పరిధిలో 28 వసతి గృహాలు ఉండగా, వీటిలో 12 ప్రీ మెట్రిక్, 16 పోస్టు మెట్రిక్ హాస్టళ్లు. ప్రీమెట్రిక్ వసతి గృహాల్లో 2,067 మంది, పోస్టు మెట్రిక్ హాస్టళ్లలో 2,591 మంది విద్యార్థులు ఉన్నారు. సుమారు 900 మంది ఈ ఏడాది కొత్తగా చేరినట్టు అధికారులు వెల్లడించారు. డిగ్రీ, పీజీ ప్రవేశాలు ప్రారంభమైతే మరో 600 నుంచి 700 మంది వరకూ చేరే అవకాశం ఉందని చెబుతున్నారు.

కానిస్టేబుల్ ఫలితాలు విడుదల

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుళ్ల నియామకానికి నిర్వహించిన ఫలితాలు శుక్రవారం వెలువడ్డాయి. రాష్ట్ర వ్యాప్తంగా 6,100 పోస్టులను భర్తీ చేసేందుకు సుమారు మూడేళ్ల కిందట ప్రక్రియను ప్రారంభించగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత శారీరక, దేహదారుఢ్య, మెయిన్స్ పరీక్షలను నిర్వహించడం ద్వారా పూర్తి చేసింది. ఈ ఫలితాల్లో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన ఎంతోమంది సత్తా చాటి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. తమ కల ఎట్టకేలకు నిజం అయ్యిందంటూ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు ఆనందాన్ని వ్యక్తంచేశారు.



అమ్మవార్లకు కుంకుమ పూజ చేస్తున్న వైదికులు

సిరుల దేవతకు లక్ష కుంకుమార్చన

సింహాచలం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహుని సన్నిధిలో శ్రావణ మాసం రెండో శుక్రవారం పురస్కరించుకుని సిరుల దేవతకు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో అమ్మవారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. సింహవల్లీ తాయార్,చతుర్భుజి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇతర అర్చకులు భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం లక్ష్మీ సహస్రనామావళి పఠిస్తూ పదిమంది వైదికులు కుంకుమార్చనలు జరిపారు. తరువాత సప్త హారతి, కర్పూర నీరాజనాలిచ్చారు. సాయంత్రం లక్ష్మీదేవికి ఆలయ బేడా మండపంలో తిరువీధి ఉత్సవం నిర్వహించారు.

ఆలయాల్లో శ్రావణ మాసం పూజలు

భీమునిపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం, కల్యాణ వెంకటేశ్వరాలయం,ఐశ్వర్య వేంకటేశ్వరాలయాల్లో శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా తమలపాకులతో అలంకరించారు.కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలోపద్మావతి అమ్మవారిని పసుపుతో అలంకరించారు.


తమలపాకులతో కన్యకాపరమేశ్వరి అలంకరణ

ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ఔషధాల వినియోగంలో అప్రమత్తం

సాగర్‌నగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజారోగ్య సంరక్షణలో ఔషధాల పాత్ర కీలకం అని ముఖ్యంగా నిషేధిత ఔషధాల వినియోగం వల్ల ఎదురయ్యే దుష్పరిణామాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ఫార్మాసిస్టులపై ఉందని రాష్ట్ర ప్రభుత్వ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) సహాయ డైరెక్టర్ ఎస్. విజయ్‌కుమార్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సింథటిక్ ఔషధాల వినియోగం ఎలా అభివృద్ధి చెందిందో వివరించారు. వైరల్ ఇన్‌ఫెక్షన్‌లకు యాంటీ బయాటిక్‌లు విచ్చలవిడిగా వాడడం ఎంతటి ప్రమాదకరమో తెలిపారు.ఈ కార్యక్రమంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీనివాసరావు, గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గంభీరంలో ప్రత్యేకాధికారి పర్యటన

ఆనందపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంభీరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ప్రత్యేకాధికారి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె. రామారావు శుక్రవారం సందర్శించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులను సబ్జెక్టుల వారీగా ప్రశ్నించి, అభ్యసనా సామర్థ్యం తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు. అలాగే మరుగుదొడ్లు, పరిశుభ్రత, ఆర్వో వాటర్ ప్లాంట్ పనితీరు, తదితర వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో పాటు హెచ్‌ఎం యూవీవీ ప్రసాద్ ఉన్నారు.

అనంతుని క్షేత్రంలో అన్నప్రసాద వితరణ

పద్మనాభం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని అనంత పద్మనాభుని క్షేత్రంలో ప్రతి శనివారం భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేయనున్నట్టు ఈఓ నానాజీబాబు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ఘాట్ రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో ఆలయానికి భక్తుల తాకిడి పెరిగిందని, స్వామివారిని దర్శించుకునే భక్తులకు ప్రసాదం అందించాలన్న సంకల్పంతో దేవస్థానం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని చెప్పారు.

పాండ్రంగిలో 'తొలి అడుగు'

పద్మనాభం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాండ్రంగి గ్రామంలో శాలివాహన సంఘం కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆ సంఘం నాయకులు అల్లూరి విగ్రహానికి, కవయిత్రి మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం గ్రామంలో పర్యటించి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర శాలివాహన సంఘం అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు టి. కృష్ణారావు, విజయనగరం జిల్లా అధ్యక్షుడు రమణ, కోశాధికారి శ్రీను, మన్యం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, టీడీపీ మండల సీనియర్ నాయకులు కె. రామరాజు, వి. ఈశ్వరరావు, మహంతి అప్పలరమణ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు, బీజేపీ నాయకుడు సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పట్టణ అధ్యక్షుడిగా అల్లిపిల్లి

భీమునిపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : భీమిలి జోన్ 3వ వార్డు వైసీపీ అధ్యక్షుడిగా అల్లిపిల్లి నరసింగరావు నియమితులయ్యారు. ఈ మేరకు స్థానిక ఎన్జీవో హోమ్‌లో నాయకులు, కార్యకర్తలు సమావేశమయ్యారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు 3వ డివిజన్ ఇన్‌ఛార్జి మైలపల్లి షణ్ముఖరావు, తదితరులు నరసింగరావును అభినందించి, గజమాలతో సత్కరించారు.

బ్యాగ్ దొరికితే సమాచారం ఇవ్వండి

ఎండాడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన యువతి బ్యాగ్ మర్చిపోయింది. పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ భాస్కర్ తెలిపిన వివరాలు ప్రకారం.. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన కొండ జాహ్నవి (23) శుక్రవారం విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఎండాడ వరకు బస్సులో ప్రయాణించింది. ఎండాడ బస్టాప్ వచ్చేసరికి కంగారులో బస్సు దిగిపోయింది. బ్యాగ్‌లో పదో తరగతి, ఇంటర్ సర్టిఫికెట్లు ఉన్నాయి. బ్యాగ్ దొరికిన వారు పీఎంపాలెం స్టేషన్‌లో లేదా 9440796060 సెల్ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

5 ఐటీ సంస్థలకు భూ కేటాయింపులు

... 3వ పేజీ తరువాయి

చెందిన బీవీఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీకి ఎండాడలో పనోరమ హిల్స్ వెనుక ఒకే దగ్గర ఏపీఐఐసీ ద్వారా 30 ఎకరాలు కేటాయించారు. అందులో వరల్డ్ ట్రేడ్ సెంటర్ నిర్మిస్తారు. ఆఫీస్ స్పేస్, కో వర్కింగ్ స్పేస్, ఉద్యోగులకు నివాసాలు, స్టార్ హోటల్ వంటివి నిర్మిస్తారు.వీరి పెట్టుబడి రూ.1,250 కోట్లు కాగా 15 వేల మందికి ఉపాధి కల్పించాలి. ముందుగా సర్వే నంబరు 179/2లో పది ఎకరాలు ఇచ్చారు. ఎకరాకు రూ.1.5 కోట్లు ధర నిర్ణయించారు. వీరు 25 లక్షల చ.అ. విస్తీర్ణంలో నిర్మాణాలు చేపడతారు. కోట్లకే ఇచ్చారు.

● పీనమ్ పీపుల్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ఐటీ క్యాంపస్ నిర్మాణానికి ముందుకు రాగా 4.45 ఎకరాలు కేటాయించారు. రుషికొండ హిల్ నంబరు 2లోని నాన్ సెజ్ ఏరియాలో 45 సెంట్లు, మధురవాడ హిల్ నంబరు 4లో నాలుగు ఎకరాలు ఇచ్చారు. ఎకరాకు రూ.4.05 కోట్లు ధర నిర్ణయించారు. వీరి పెట్టుబడి 2078.5 కోట్లు కాగా దశల వారీగా ఐదేళ్లలో 2,500 మందికి ఉద్యోగాలు కల్పించాలి. ఏడాదిలో క్యాంపస్ ఏర్పాటుచేసి, రెండేళ్లలో 1,250 మందికి ఉపాధి చూపించాలి.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన

» ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
» తర్లువాడలో కొత్త పింఛన్ల పంపిణీ


తర్లువాడలో పింఛన్ సొమ్ము ఇస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఆనందపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన తర్లువాడ గ్రామంలో రూ. 1.90 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, తాగునీటి కుళాయిల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. 62. 95 లక్షల మందికి సామాజిక పింఛన్ల కింద రూ. 32,520 కోట్లు, 67 లక్షల మందికి తల్లికి వందనం పథకం కింద రూ.10 వేల కోట్లు ఇచ్చామని వివరించారరు. అలాగే లక్షలాది మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద మూడు విడతల్లో రూ. 20 వేలు పెట్టుబడి సాయం, ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం రూ. 2,684 కోట్లు మహిళల ఖాతాల్లో జమ చేస్తున్నామని చెప్పారు. అనంతరం ఆయన కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. అలాగే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. తరువాత మండల పరిషత్ కార్యాలయంలో మహిళా మార్ట్‌లో లబ్ధిదారులకు ఎగ్ కార్ట్ వాహనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఆర్‌డీఓ సంగీత్ మాథూర్, ఎంపీడీఓ జానకి, తహసీల్దార్ శ్రీనుబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు అప్పారావు, స్వామినాయుడు, సర్పంచ్ నాయుడు, కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యం

కొమ్మాది : ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన ఆరో వార్డులోని ఎం2 కాలనీలో కొత్తగా మంజూరైన స్పౌజ్ పిం ఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో భర్త చనిపోతే అక్కడితో పిం ఛన్ ఆగిపోయేదని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో సహృదయంతో భర్త ఏ నెల చనిపోతే అదే నెల నుంచి భార్యకు వితంతు పింఛన్ ఇచ్చేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. నియోజకవర్గానికి కొత్తగా 363 వితంతు పింఛన్లు మంజూరు కాగా మధురవాడ జోన్‌కు 267 పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలను ఆపడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆరో వార్డు టీడీపీ నాయకులు గరే గురునాథ్, మన్యాల సోంబాబు, బోయి వెంకటరమణ, లొడగల జానకీ రామ్, పిళ్లా వెంకట్రావు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. కాగా ఐదో వార్డులోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ మొల్లి హేమలత పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, నాగోతి సత్యనారాయణ, కొండపు రాజు, ఓలేటి శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

ఏడో వార్డు పరిధిలో...

మధురవాడ : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సూర్యప్రకాశరావు, అచ్యుతరావు, దుర్గారావు, శివాజీ పాల్గొన్నారు.

ఎనిమిదో వార్డులో..

సాగర్‌నగర్/ఎండాడ : సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం ప్రాంతాల్లో కొత్తగా మంజూరైన వితంతు పింఛన్లను శుక్రవారం పంపిణీ చేశారు. 86, 87 సచివాలయాల పరిధిలో ఆరుగురికి పింఛన్లు మంజూరయ్యాయి. వీటిని 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, జోన్-2 కమిషనర్ కనకమహాలక్ష్మి లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు శాఖరి శ్రీనివాసరావు, చెట్టుపల్లి సన్యాసిరావు, బి. దొరబాబు, సారిపల్లి శ్రీనివాసరావు, మంగాదేవి, పరమేశ్వరరావు, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆనందం

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డులోని సింహగిరి గ్రామంలో నూతనంగా మంజూరైన పింఛన్లను కార్పొరేటర్ నరసింహం లబ్ధిదారులకు అందజేశారు. వార్డులో కొత్తగా 20 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. సింహగిరి గ్రామంలో వృద్ధురాలు సోమాల అప్పలకొండకు పింఛన్ అందజేసిన సమయంలో ఆమె ఆనందంతో కన్నీరు పెట్టుకున్నారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాస్, బూత్ ఇన్‌చార్జిలు బూర్లె కనకరాజు, మజ్జి చంద్ర శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

ఏఐటీయూసీ నాయకుడు రామారావుకి నివాళి

తగరపువలస, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : కార్మిక నాయకుడు, ఏఐటీయూసీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వీవీ రామారావు 4వ వర్ధంతి శుక్రవారం తగరపువలస సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు.పార్టీ నాయకుడు చిల్ల నరసింహులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు రామారావు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. కార్మికుల సంక్షేమానికి రామారావు చేసిన కృషిని, పోరాటాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చిట్టివలస లేబర్ యూనియన్ అధ్యక్షుడు పడాల రమణ, సీపీఐ ఏరియా కార్యదర్శి కానూరి రాంబాబు, చిట్టివలస ఏఐటీయూసీ అధ్యక్షుడు ఈశ్వరరావు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణులకు ప్రత్యేక పూజలు

కొమ్మాది,ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అష్టలక్ష్మీ దేవాలయంలో శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా లక్ష్మీనారాయణులకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ ప్రధాన అర్చకుడు చామర్తి శ్రీధరస్వామి అష్టలక్ష్మీ హోమం నిర్వహించి, అనంతరం లక్ష్మీనారాయణులను తులసిమాలలతో అలంకరించారు. భక్తులకు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ,రమాదేవి దంపతులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వేములవలసలో తల్లిపాల వారోత్సవాలు

ఆనందపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేములవలస గ్రామంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గంభీరం ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ శిరీష మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు ఇవ్వడం వల్ల పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈనెల 7వ తేదీ వరకు మండలంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

క్లాప్ లోడర్స్ సూపర్‌వైజర్ల నిరసన

కొమ్మాది, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : క్లీన్ ఆంధ్రప్రదేశ్ క్లాప్ లోడర్స్ సూపర్‌వైజర్లు తమకు వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జోన్ -2 కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఫ్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ఈ సంద ర్భంగా సీఐటీయూ నాయకులు డి. అప్పలరాజు, రాజ్‌కుమార్ మాట్లాడుతూ నెలలు తరబడి వేతన బకాయిలు చెల్లించాల్సి ఉందని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం లేదని తెలిపారు. అనంతరం జడ్సీ కనక మహాలక్ష్మికి వినతిపత్రం అందించారు.

సీఆర్‌జడ్ నిబంధనల ఉల్లంఘనపై చర్యలు ఏవి?

భీమునిపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీచ్ రోడ్‌లో సముద్ర తీరాన్ని ఆనుకుని సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘించి రెస్టారెంట్లు, బార్లు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారని ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు ప్రశ్నించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పర్యావరణాన్ని కాపాడవలసిన అధికారులే తప్పుడు నివేదికలు ద్వారా నిబంధనలు ఉల్లంఘించిన వారిని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు.

అప్పన్న సన్నిధిలో గుజరాత్ హైకోర్టు జడ్జి


జడ్జి మానవేంద్రనాథ్‌రాయ్, దర్శకుడు రవీంద్ర

సింహాచలం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : గుజరాత్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సీహెచ్ మానవేంద్రనాథ్‌రాయ్ శుక్రవారం వరాహలక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు, ఏఈఓ తిరుమలేశ్వరరావు పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు.కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న జడ్జి గోత్రనామాలతో అంతరాలయంలో పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను జ్ఞాపికగా, ప్రసాదాలను అందజేశారు. అలాగే టాలీవుడ్ దర్శకుడు కెఎస్ రవీంద్ర (బాబీ) కూడా స్వామివారిని దర్శించుకున్నారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ఆయన గోత్రనామాలతో అంతరాలయంలోఅర్చకులు పూజలు జరిపారు. గోదాదేవి దర్శనం తరువాత అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు. దర్శకుడ్ని గుర్తించిన కొందరు సెల్ఫీ తీసుకున్నారు.

రీసర్వేను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ గోవిందరావు

పద్మనాభం రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సర్వే ల్యాండ్ రికార్డ్సుస్పెషల్ జాయింట్ కమిషనర్ ఆర్.గోవిందరావు అన్నారు. శుక్రవారం ఆయన గంధవరం గ్రామంలో రీసర్వేపై జరిగిన గ్రామ సభలో మాట్లాడారు. రీసర్వే వల్ల 95 శాతం భూ తగదాలు జరగవని చెప్పారు. 1953-57 మధ్య నిర్వహించిన సర్వే కంటే ప్రస్తుతం నిర్వహిస్తున్న రీసర్వే పారదర్శకంగా ఉంటుందన్నారు. బౌండరీ యాక్ట్ 1923 ప్రకారం యజమానుల సమక్షంలోనే హద్దులు నిర్ణయించి, ఎల్‌పీఎం నంబర్లు ఇస్తామని తెలిపారు. రెండేళ్ల క్రితం వరకు సాదా బైనామ పత్రాలతోనే ఎల్‌పీఎం నంబర్లతో నమోదు చేసేవారని. అ జీవోను పొడిగించడంతో సాదా బైనామ పత్రాలతో ప్రస్తుతం ఎల్‌పీఎం నంబర్ల ఇవ్వలేకపోతున్నామని పేర్కొన్నారు. ఈ సభలో భీమిలి ఆర్డీవో సంగీత్ మాథూర్, విశాఖ సర్వే ల్యాండ్ రికార్డ్సు డైరెక్టర్ కె. సూర్యరావు, తహసీల్దార్ కాకర ఆనందరావు, గంధవరం సర్పంచ్ మురళీరాజు, ఎంపీటీసీ సభ్యుడు రమణరాజు, డీటీ శ్రీనివాసరావు, వీఆర్వో కనకారావు, వీఆర్‌ఏలు మంగమ్మ, ఎర్నిబాబు పాల్గొన్నారు.

భీమిలిలో ఐసీడీఎస్ పీడీ ఆకస్మిక పర్యటన


చిన్నారులకు నైట్ డ్రస్‌లను పంపిణీ చేస్తున్న రామలక్ష్మి

భీమునిపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ పీడీ కేవీ రామలక్ష్మి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. అప్పికొండ వీధి, తోటవీధి కేంద్రాలతో పాటు చిన్నబజారులో ప్రభుత్వ మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల సదనం సందర్శించారు. కేంద్రాల్లో తల్లిపాల ప్రాధాన్యతను బాలింతలకు వివరించారు. బాల సదనంలో పిల్లలతో ముచ్చటించారు.ప్రభుత్వం సరఫరా చేసిన నైట్ డ్రస్‌లు, కాస్మోటిక్స్‌ను విద్యార్థినులకు అందించారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమిలి సీడీపీవో శ్రీదేవి, నోడల్ ఆఫీసరు ఝాన్సీ, డిసి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ నాగమణి, కార్యకర్తలు వెంకటలక్ష్మి, రమాకుమారి, బాల సదనం సూపరింటెండెంట్ ఊర్మిళ పాల్గొన్నారు.

కాలనీ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయండి

మండల ప్రత్యేకాధికారి జ్ఞానవేణి

పద్మనాభం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ప్రత్యేకాధికారి కె.జ్ఞానవేణి చెప్పారు. శుక్రవారం ఆమె మండల పరిషత్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.పునాది స్థాయి, లింటల్ లెవిల్, శ్లాబ్ లెవిల్ స్థాయిల్లో నిర్మాణాలు ఉన్నాయన్నారు. వాటిని పూర్తి చేయించేలా లబ్దిదారులను సమాయత్తం చేయాలని హౌసింగ్ శాఖాధికారులను ఆదేశించారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పీ4 సర్వేను సమర్థంగా చేపట్టాలన్నారు. అనంతరం ఆమె పద్మనాభంలోని ఆరోగ్య ఉప కేంద్రం, కేజీబీవీ పాఠశాల, బీసీ హాస్టల్, కృష్ణాపురం అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో వసతులను పరిశీలించారు. తునివలసలో నిర్మాణంలో ఉన్న కాలనీ ఇళ్లను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ సూరిబాబు, డీఈఈ రామకృష్ణ, ఎంపీడీఓ విజయకుమార్, డి ప్యూటీ ఎంపీడీఓ మీనాకుమారి, ఎంఈఓ రమణ, హౌసింగ్ ఏఈ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.


ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి జ్ఞానవేణి


సీహెచ్‌సీలో రోగితో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

రోగులకు మెరుగైన వైద్యం అందించండి

» కలెక్టర్ హరేంధిర ప్రసాద్ » భీమిలి ప్రభుత్వాస్పత్రి సందర్శన

భీమునిపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను కలెక్టర్ హరేంధిర ప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రిలో పలు విభాగాలను పరిశీలించారు. పరిసరాలను పరిశీలించి, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు రోగులకు అవసరమైన మందులన్నీ ఆస్పత్రిలోనే అందించాలని, బయటకు పంపించరాదని సూచించారు. అనంతరం వార్డులను తనిఖీ చేశారు. స్త్రీలు, పురుషులకు జనరల్ వార్డు కలిసి ఉండడంతో రెండు విభాగాలుగా మార్పు చేయాలని సూచించారు. ఆస్పత్రి ఆవరణలో ఉన్న స్థానిక బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులతో మాట్లాడారు. పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్కూల్ ఏఎన్‌ఎంకు సూచించారు. అక్కడి నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించారు. కంప్యూటర్ వద్దకు వెళ్లి ఆటో మ్యుటేషన్‌పై రిజిస్ట్రార్ ఉపేంద్రను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ శంకర్‌ప్రసాద్, భీమిలి సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసరు డాక్టర్ ఫణికుమార్, జడ్పీ అయ్యప్పనాయుడు పాల్గొన్నారు.

ఎంఐజీ లేఅవుట్లకు కొరవడిన ఆదరణ

... 3వ పేజీ తరువాయి

నచ్చింది ఇవ్వకపోతే ఎలా? అంటూ ముందుకురాలేదు. పైగా ఆయా లేఅవుట్లలో అన్ని ప్లాట్లకు ఒకటే ధర నిర్ణయించారు. అంటే రహదారి పక్కన ఉన్న వాటికి, దూరంగా ఉన్నవాటికి ఒకటే ధర పెట్టారు. అది కూడా చాలామందికి నచ్చలేదు. అంతేకాకుండా లేఅవుట్ల అభివృద్ధి పనులు కూడా ఆశించినంత వేగంగా సాగలేదు. దరఖాస్తుదారులు కట్టిన సొమ్ముతో దశల వారీగా మౌలిక వసతులు కల్పిస్తామని అధికారులు చెప్పడంతో చాలామంది వెనక్కి తగ్గారు. చివరికి వాటిని ఆదరణ కరవైంది. కేవలం పాలవలస లేఅవుట్‌లో ప్లాట్లు తీసుకునేందుకు మాత్రమే అత్యధికులు మొగ్గు చూపారు. అది కూడా అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారికి పక్కన ఉండడంతో ప్రభుత్వ ఉద్యోగులు అంతా అక్కడ స్థలం కోసం దరఖాస్తు చేశారు. అందులో 472 ప్లాట్లు ఉండగా 435 కేటాయించేశారు. ఇంకా 37 ఉన్నాయి. రామవరం, గంగసాని అగ్రహారం-1, 2లలో బోణీ పడలేదు. అంటే ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. గరివిడిలో 211 ప్లాట్లకు ముగ్గురు మాత్రమే తీసుకున్నారు. అడ్డూరులోని 146 ప్లాట్లలో 30 మంది తీసుకున్నారు. ఇంకా 116 ఉన్నాయి. మొత్తం ఆరు లేఅవుట్లలో 2,468 ప్లాట్లు వేయగా, 468 అమ్ముడుపోయాయి. ఇంకా 2వేలు ఖాళీగా ఉన్నాయి.

కొత్త మార్గదర్శకాలు

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఎంఐజీ లేఅవుట్లపై కొత్త మార్గదర్శకాలు ఇచ్చింది. ఈ లేఅవుట్లకు మళ్లీ కొత్తగా దరఖాస్తులు స్వీకరించవద్దని స్పష్టం చేసింది. పాత దరఖాస్తులనే బయటకు తీసి, ఆసక్తి చూపిన వారికి లాటరీ ద్వారా కేటాయించాలని పేర్కొంది. అవి పోను ఇంకా మిగిలితే వేలం ద్వారా విక్రయించాలని ఆదేశించింది.

ఇకపై ఎవరైనా కొనుక్కోవచ్చు

ఇకపై ఎంఐజీ ప్లాట్లను వేలంలో విక్రయిస్తారు. ఎవరైనా పాల్గొనవచ్చు. వాటికి నిబంధనలు వర్తించవు. అంటే వార్షిక ఆదాయంపై పరిమితి ఉండదు. పాలవలసలో గజం ధర రూ.14 వేలు పెట్టారు. దాదాపు అన్నీ అయిపోనట్టే. రామవరం, జీఎస్ అగ్రహారం లేఅవుట్లకు ఇంకా ధరలు నిర్ణయించలేదు. రఘుమండలో గజం రూ.6,500 కాగా అడ్డూరులో రూ.4 వేలు పెట్టారు. గరివిడిలో మొదట గజం ధర రూ.7,700 పెట్టి అధికంగా ఉందని ఎవరూ ముందుకు రాకపోవడంతో దానిని రూ.2 వేలు తగ్గించి రూ.5,700 చేశారు.

లాటరీ ద్వారా కేటాయించాలని డిమాండ్

మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధర అని ప్రకటించడం, ఆ తరువాత వేలం పెట్టడం వల్ల ఆ పరిసర ప్రాంత రియల్ ఎస్టేట్ సంస్థలు వాటి ధరలను కావాలనే పెంచేస్తున్నాయి. దాంతో ఎవరికీ అవి అందుబాటులో ఉండడం లేదు. వీఎంఆర్‌డీఏ తన ఖర్చులు, లాభం వేసుకొని లాటరీ ద్వారానే వాటిని విక్రయిస్తే రేట్లు పెరగవు. నచ్చిన వారు కొనుక్కుంటారు. ఇప్పుడు కూడా ఎన్‌టీఆర్ ఎంఐజీ లేఅవుట్లలో మిగిలిన రెండు వేల ప్లాట్లను కొత్తగా దరఖాస్తులు ఆహ్వానించి లాటరీ ద్వారానే కేటాయించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. వీఎంఆర్‌డీఏ వేలం పాటలు పెట్టి భూముల ధరలు పెంచడం మానుకోవాలని కోరుతున్నాయి. దీనికి ప్రభుత్వం సహకరించడం విచారకరమని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

అమ్మో.. హోటల్ ఫుడ్!

... 3వ పేజీ తరువాయి

చూసి అధికారులే విస్తుపోయారు.

నగరంలో పలు హోటల్స్, రెస్టారెంట్స్‌లో దారుణ పరిస్థితులు ఉన్నాయని, రోజుల తరబడి నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు వేడి చేసి వడ్డిస్తున్నారని, ఫలితంగా ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని ప్రభుత్వానికి పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. వీటిని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం ఆకస్మికదాడులు నిర్వహించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించింది. ఈ మేరకు ఆహార భద్రత, ప్రమాణాల శాఖ జాయింట్ ఫుడ్ కంట్రోలర్ ఎన్.పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో తూనికలు కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ థామస్ రవికుమార్, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్లు జీఏబీ నందాజీ, చక్రవర్తి, మరో 40 మంది అధికారులు 20 బృందాలుగా విడిపోయి, నగర పరిధిలోని 40 హోటల్స్, రెస్టారెంట్స్‌లో శుక్రవారం ఆకస్మిక దాడులు చేశారు.

అధికారులే షాక్‌కు గురయ్యేలా...

దాడుల్లో అధికారులు షాక్‌కు గురయ్యే పరిస్థితులు కనిపించాయి. అనేకచోట్ల దుర్వాసన వెదజల్లే ఆహార పదార్థాలనే వేడి చేసి కస్టమర్లకు వడ్డిస్తున్నట్టు గుర్తించారు. తనిఖీలు చేసిన హోటల్స్‌లో రోజుల తరబడి నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఇసుకతోటలోని మాయ, ముంతాజ్ హోటళ్లలో రోజుల తరబడి నిల్వ ఉన్న చికెన్, మటన్, రొయ్య తదితర పదార్థాలను వినియోగిస్తున్నట్టు తేలింది. జగదాంబ జంక్షన్ సమీపంలోని ఆల్ఫా హోటల్‌లో ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన ఆహారాన్ని గుర్తించారు. కొన్నిచోట్ల దుర్వాసన వెదజల్లే పదార్థాలను వేడి చేసి కస్టమర్లకు వడ్డించేందుకు సిద్ధం చేస్తున్నట్టు గుర్తించారు. అనేకచోట్ల అపరిశుభ్ర వాతావరణంలో కిచెన్ నిర్వహిస్తున్న తీరు తనిఖీల్లో బయటపడింది. చికెన్, మటన్, చేపలు, రొయ్యల గ్రేవీలు నాలుగు నుంచి ఐదురోజులపాటు నిల్వ ఉంచినవిగా తేల్చారు. అన్ని హోటల్స్‌లో హానికారక రంగులను వినియోగించడంతోపాటు కొన్నిరకాల పిండిపదార్థాలు, ఆయిల్స్ దారుణంగా ఉన్నట్టు అధికారుల తనిఖీల్లో తేలింది.

పరీక్షల నిమిత్తం నమూనాలు

తనిఖీల్లో గుర్తించిన 42 రకాల ఆహార పదార్థాల నమూనాలు సేకరించిన అధికారులు పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీకి పంపించారు. అత్యంత దారుణంగా ఉన్నట్టు నిర్ధారించిన హోటళ్లపై 24 కేసులను నమోదు చేశారు. ల్యాబ్ రిపోర్టుల ఆధారంగా మిగిలిన వాటిపై చర్యలు తీసుకుంటామని జాయింట్ ఫుడ్ కంట్రోలర్ ఎన్.పూర్ణచంద్రరావు తెలిపారు. తనిఖీలను శనివారం కూడా నిర్వహిస్తామన్నారు.

అనుమతి లేని ఫెర్టిలిటీ సెంటర్లపై చర్యలు

... 3వ పేజీ తరువాయి

డ్రై డే పాటించాలని, దోమల ఉత్పత్తి స్థావరాలను గుర్తించి నిర్వీర్యం చేయాలన్నారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, షాపింగ్‌మాల్స్‌లో మిల్క్ ఫీడింగ్ గదులను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. అనంతరం ఎయిడ్స్‌పై జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన కలిగించాలన్నారు. సమీక్ష సమావేశంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, ఐసీడీఎస్ పీడీ రామలక్ష్మి, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూనగర్‌లో రేషన్ డిపో ప్రారంభం



రేషన్ డిపో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఆరిలోవ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజాభీష్ట మేరకు వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాలన చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. జీవీఎంసీ 12వ వార్డులోని నెహ్రూనగర్‌లో గురువారం 221 రేషన్ డిపోను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సౌలభ్యం కోసం ఈ ప్రాంతంలో రేషన్ డిపో ప్రారంభించినట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, టీడీపీ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, విశాఖ పార్లమెంటరీ టీడీపీ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 20 వినతులు



వినతులను స్వీకరిస్తున్న చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు

వెంకోజీపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 20 వినతులు వచ్చినట్టు జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన చాంబర్‌లో సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీపీ మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో ప్రజలు పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు తదితర వాటిని ప్రతి శుక్రవారం నమోదు చేసుకోవచ్చన్నారు. వీటిని నిర్దేశిత సమయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు.

పింఛన్ల పంపిణీ

వెంకోజీపాలెం/ పెదవాల్తేర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డులో టీడీపీ వార్డు అధ్యక్షుడు నారు గోపి, ముగడ వాసు, తూర్పు నియోజకవర్గం టీడీపీ మహిళా అధ్యక్షురాలు పల్లా ఉమారాణి తదితరులు శుక్రవారం పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. అలాగే 20వ వార్డులో టీడీపీ వార్డు అధ్యక్షులు బైరెడ్డి పోతన్నరెడ్డి పెదవాల్తేరు గాంధీబొమ్మ సెంటర్ వద్ద, పెదవాల్తేరు, చినవాల్తేరు తదితర ప్రాంతాల్లో పెన్షన్ల పంపిణీ చేశారు.

సినిమా గైడ్

- **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **కింగ్డమ్** : జగదాంబ
- **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి
- **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **హరిహర వీరమల్లు** : శారద, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 46, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 44, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 32, బీరకాయలు 48, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 20, క్యారెట్ 44, దొండకాయలు 42, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 36,అల్లం (పాతది) 70, బరబాటి 46, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 50, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 30, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 42, దేముడు చిక్కుడు 98, గోరు చిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	83
లైవ్ ధర	103
విత్ స్కిన్	176
స్కిన్‌లెస్	186

చాకలిపేటలో ఉద్రిక్తత

- విద్యుత్ సరఫరా నిలిపివేతకు వచ్చిన సిబ్బందిని అడ్డుకున్న స్థానికులు
- కార్పొరేటర్ మూర్తి యాదవ్ వేధింపుల నుంచి రక్షించండి అంటూ ఆందోళన
- దుకాణం తొలగింపు, పెట్రోల్ పోసుకొని నిర్వాహకురాలు ఆత్మహత్యాయత్నం
- కోర్టు ఆదేశాలు ఉన్నా తొలగించడం అన్యాయమంటూ బాధిత మహిళ ఆవేదన

మద్దిలపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పిఠాపురంకాలనీలోగల చాకలిపేటలో శుక్రవారం దుకాణంతో పాటు విద్యుత్ సరఫరా నిలిపివేత వ్యవహారం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. దుకాణం తొలగింపునుప్రతిఘటించిన నిర్వాహకురాలు ఇందుకు కారణం 22వ వార్డు కార్పొరేటర్ మూర్తి యాదవ్ అని ఆరోపిస్తూ తీవ్రంగా రోధిస్తూ శరీరంపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. అక్కడ ఉన్న అధికారులు, స్థానికులు అప్రమత్తమై ఆమె నిప్పు అంటించుకోకుండా నిలువరించారు. కాగా, కార్పొరేటర్ మూర్తి ఆదేశాల మేరకు తాము దుకాణంతో పాటు వికలాంగుడికి చెందిన రేకుల షెడ్డుకు విద్యుత్ సరఫరా తొలగింపునకు వచ్చామని అధికారులు చెప్పడంతో స్థానిక మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ కార్పొరేటర్ మూర్తి యాదవ్ వేధింపుల నుంచి తను రక్షించాలని కోరుతూ నిరసనకు దిగారు. వారికి అధికారులు సర్దిజెప్పి పంపించారు. వివరాలిలా ఉన్నాయి.

చాకలిపేటలోని కనక అనే మహిళ నిర్వహిస్తున్న దుకాణం, వికలాంగుడు శ్రీనివాసరావు నివాసముంటున్న రేకులషెడ్డుకు విద్యుత్ కనెక్షన్ కట్ చేయడానికి టౌన్‌ప్లానింగ్, విద్యుత్ శాఖ సిబ్బంది శుక్రవారం ఉదయం ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అయితే ఇక్కడ అరవై ఏళ్ల నుంచి నివాసముంటున్నామని, కోర్టు ఆర్డర్ కూడా ఉండగా మీరు ఎలా కరెంట్ కట్ చేస్తారని అక్కడి వారంతా సిబ్బందిని నిలదీశారు. కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ కరెంట్ కట్ చేయమన్నారని వారు చెప్పడంతో బాధితులు మండిపడ్డారు. కరెంట్ కట్ చేస్తే ఊరుకోమని భీష్మించారు. అయినా వారు విద్యుత్ కనెక్షన్ కట్ చేసేందుకు ప్రయత్నించగా కనక తన చేతిలోని బాటిల్‌లతో ఉన్న పెట్రోల్‌ను తన ఒంటిపై పోసుకుంది. దుకాణం తొలగిస్తే ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించింది. వెంటనే అక్కడ ఉన్న స్థానికుల కనకను ఒంటిపై నీరు చల్లారు. అనంతరం కార్పొరేటర్ మూర్తి యాదవ్ వేధింపుల నుంచి తమను రక్షించాలని కోరుతూ రోడ్డుపై బైఠాయించారు. అంతలో పోలీసులు, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మధుసూదనరావు, విద్యుత్ శాఖ డీఈ, ఏఈలు అక్కడకు చేరుకున్నారు.రోడ్డుపై బైఠాయించిన మహిళలతో చర్చించారు.

విద్యుత్ కనెక్షన్ తీయమని సర్దిచెప్పారు. కాలువపై అడుగు మేర దుకాణం ఉందని, ఆ మేరకు మాత్రం తొలగిస్తామని నచ్చజెప్పారు. అందుకు వారు సరేననడంతో అడుగు మేర దుకాణం తొలగించాలని సిబ్బందికి ఏసీపీ చెప్పి వెళ్లిపోయారు.అయితే, కాసేపటికి మళ్లీ ఏసీపీ బాధితులకు ఫోన్ చేసి దుకాణం మొత్తం తొలగించాలని కార్పొరేటర్ ఒత్తిడి చేస్తున్నారని, అందుకే దుకాణం మొత్తం తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో దుకాణాన్ని తొలగించారు.



ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి సిద్ధమైన దుకాణ నిర్వాహకురాలు కనక

వరలక్ష్మి అలంకరణలో నూకాంబికా అమ్మవారు



ఆరిలోవ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ, పరిసర ప్రాంతాల్లో శ్రావణ రెండోశుక్రవారంలో భాగంగా వరలక్ష్మీదేవి పూజలను మహిళలు భక్తిశ్రద్ధలతో చేశారు. ఇందు లోభాగంగా పాత డెయిరీ ఫారం వెటర్నరీ కాలనీలో వెలసిన నూకాంబిక అమ్మవారి ఆలయంలో అమ్మవారినివరలక్ష్మీదేవిగా అలంకరించారు. పలు రకాలు పూలు, పండ్లు, పాయసాన్నాలతోను నివేదన చేశారు అధిక సంఖ్యలో భక్తులు పూజలో పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతంలో దోమల నివారణకు చర్యలు

వెంకోజీపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో దోమలు, ఈగలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా 15వ వార్డు సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది శుక్రవారం ఫాగింగ్ నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య ఆధ్వర్యంలో కొండవాలు ప్రాంతంలో వీధి వీధిన ఫాగింగ్ చేశారు. ప్రజలందరూ నీరును నిల్వ ఉండకుండా చూసుకోవాలని, వారానికి ఒక రోజు కుండీలను ఖాళీగా ఉంచాలని, క్రిమికీటకాలు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కార్పొరేటర్ శ్రీవిద్య స్థానికులకు సూచించారు.

ఫుట్‌పాత్ పనులు అడ్డుకున్న చిరువర్తకులు



ఫుట్‌పాత్ పనులు అడ్డుకుంటున్న తోపుడుబండ్ల వర్తకులు

మద్దిలపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు కళాభారతి రోడ్డులో ఫుట్‌పాత్ నిర్మాణాలను శుక్రవారం చిరు వర్తకులు అడ్డుకున్నారు. కళాభారతి రోడ్డులో 26 తోపుడు బండ్లను వ్యాపారాలు చేసుకోవడానికి కోర్టు స్టేటస్-కో ఇచ్చిందని కాంట్రాక్టర్‌కు తెలిపారు. కోర్టు ఆదేశాలున్న ప్రాంతంలో ఫుట్‌పాత్ నిర్మాణాలు ఏ విధంగా చేస్తారని ప్రశ్నించారు. కళాభారతి రోడ్డులో తోపుడు బండ్ల వ్యాపారాలు తొలగించడానికే కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఫుట్‌పాత్ ప్రతిపాదనలు చేశారని మండిపడ్డారు. మా వ్యాపారాలు తొలగించి బతుకు లేకుండా చేయడానికి కార్పొరేటర్ అన్నిరకాల ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇంతలో పోలీసులు అక్కడకు చేరుకుని పనులు ఆపుతున్న వర్తకులను చెదరగొట్టారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించండి

- ప్రజలకు పలు ప్రజా సంఘాల ప్రతినిధులు పిలుపు



సమావేశంలో పాల్గొన్న ప్రజా సంఘాల నేతలు, ప్రతినిధులు

ఆరిలోవ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పని చేస్తున్న విద్యుత్ మీటర్లు ఉండగా, అదానికి ప్రయోజనం సిద్ధించే ఉద్దేశంతో స్మార్ట్ మీటర్లను బిగించి ప్రజలపై విపరీతమైన భారాలు వేసే ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉందని, అందుకు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని పలు ప్రజా సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఆరిలోవ ప్రాంతంలో సీఐటీయూసీ, ఏఐటీయూసీ, ఐద్వా, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య మొదలైన ప్రజా సంఘాలు గురువారం ఆరిలోవలో సమావేశమయ్యాయి. ఈ సందర్భంగా ఆయా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ఈ స్మార్ట్ మీటర్ల పేరుతో 93 వాయిదాల్లో విద్యుత్ బిల్లులతో కలసి రూ.9 నుంచి రూ.13 వేలు అదనంగా వసూలు చేసేందుకు ప్రభుత్వం సమాయత్తం అవుతోందని ఆరోపించారు. మరో పక్క సర్దుబాటు చార్జీల పేరుతో ఇప్పటికే ప్రజలపె రూ.15 వేల 485 కోట్ల అదనపు భారం వేశారని విమర్శించారు. తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా, పెంచిన కరెంట్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 2న ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకత్వంలో విద్యుత్ ఏఈ కార్యాలయం వద్ద, ఆగస్టు 5న సీఎండీ కార్యాలయం వద్ద నిరసన నిర్వహిస్తామని ప్రకటించారు. ఇప్పటికే నగరంలో అన్ని వార్డుల్లో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పాదయాత్రలు నిర్వహిస్తూ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని, వాటిని బిగించడానికి వస్తే పగుల గొట్టాలని ప్రచారం చేస్తున్నామని అన్నారు. కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దుచేయకుంటే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు, సీఐటీయూ మద్దిల పాలెం జోన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.నరేంద్రకుమార్, డి.అప్పలరాజు, పి.శంకర్, సీపీఐ ఆరిలోవ ప్రాంత కార్యదర్శి కె.లక్ష్మణరావు, ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు సీహెచ్ కాసుబాబు, ఐద్వా నాయకురాలు వి.శాంతి, కె.కుమారి, ఎన్ఎఫ్ డడ్లూ, మహిళా సంఘం నాయకులు ఎ.దేవుడమ్మ, ఏఐఎఫ్ నాయకులు కె.సంతోష్‌పుష్ప తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను విద్యార్థులకు చేరువ చేయాలి

- ఆచార్య నాగార్జున వర్సిటీ పూర్వ వీసీ బాల మోహన్‌దాస్



కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ బాలమోహన్‌దాస్, ఏయూ మాజీ రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్, ఐఐఏఎం ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : సాంకేతికతను విద్యార్థులకు చేరువ కావడమే లక్ష్యంగా కళాశాలల యాజమాన్యాలు ముందుకు వెళ్లాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వైస్ చాన్సలర్ బాల మోహన్‌దాస్ సూచించారు. ఎంవీపీ కాలనీలోని ఐఐఏఎం కళాశాలలో అడ్మిషన్స్ ఆన్ వీల్ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏయూ మాజీ రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ విద్యార్థులు అడ్మిషన్ కోసం సంస్థ వద్దకు రావాల్సిన అవసరం లేకుండా చేసే కళాశాల వినూత్న ప్రయత్నాన్ని అభినందించారు. సంస్థ డీన్, డైరెక్టర్ డాక్టర్ ఎస్పీ రవీంద్ర మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థులకు ఉన్నత విద్య అందించడమే లక్ష్యంగా భారతదేశంలో మొదటిసారిగా అడ్మిషన్ ఆన్ వీల్స్ ప్రారంభించినట్టు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాల అందజేత



పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, టీడీపీ యువనేత ప్రతాప రుద్ర

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం పరిధిలోని పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధికి సంబంధించిన మంజూరు పత్రాలను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శుక్రవారం ఎంవీపీ కాలనీలోని ఆయన కార్యాలయంలో అందజేశారు. ఇసుకతోటకు చెందిన పళ్ల అచ్చియ్యమ్మకు రూ 43,727లు, హెచ్‌బీ కాలనీ భానునగర్ ప్రాంతానికి చెందిన చప్ప అప్పలనర్సమ్మ, సాగర్‌నగర్‌కు చెందిన హనుమంతు మోహన్‌రావుకు రూ.1,18,881లు, ఎంవీపీ కాలనీకి చెందిన బలగ కుమారికి రూ.82,095లు చెక్కులను అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారు గోపి, పళ్ల ఉమారాణి, మొల్లి శోభ, మొల్లి శంకర్, ప్రతాప్ రుద్ర వెలగపూడి, కళ్ల శంకర్, బోర ధనరెడ్డి, గొలగాని మంగవేణి, గేదెల నాగరాజు లావణ్య, నక్క కనకరాజు, తెడ్డురాజు తదితరులు పాల్గొన్నారు.

నృత్య కళాకారిణి కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సహాయం

- వీఎంఆర్డీఏ చైర్మన్ చేతుల మీదుగా అందజేసిన నృత్య కళాకారిణులు



వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ చేతుల మీదుగా నృత్య కళాకారిణి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న దృశ్యం

సిరిపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తూ ఇటీవల మృతి చెందిన మహిళా నృత్య కళాకారిణి రమ కుటుంబాన్ని ఆదుకునేందుకు విశాఖ డ్యాన్సర్, డ్యాన్స్ మాస్టర్స్ అసోసియేషన్‌కు చెందిన మహిళా కళాకారులు రూ.2 లక్షల ఆర్థిక సహాయం చేశారు. ఈ ఆర్థిక సహాయం బాండ్‌ను శుక్రవారం సాయంత్రం వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ చేతుల మీదుగా రమ భర్త అప్పలరాజుకు అందజేశారు. అలాగే మహిళా నృత్య కళాకారులకు ప్రత్యేక ప్రదర్శనల సమయంలో దుస్తులు మార్పు చేసుకునేందుకు వీలుగా ఉండేలా గ్రీన్ రూమ్స్ వంటి సామగ్రిని కూడా అందజేశారు. విశాఖ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ మాస్టర్స్ అసోసియేషన్, కరుణ ఈవెంట్స్ సంయుక్తంగా సామగ్రికి అవసరమైన ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ తోటి కళాకారుని కుటుంబాన్ని ఆదుకునేందుకు మహిళా కళాకారులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కళాకారులు తన కళ ద్వారా వినోదాన్ని పంచుతారని, అలాంటి నృత్య కళాకారులకు గ్రామీణ ప్రాంతాల్లో ప్రదర్శనలు జరిగిన సమయంలో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అందుకోసం వారికి ప్రయోజనకరంగా ఉండేలా దుస్తులు మార్పులు చేసుకునేందుకు వీలుగా గ్రీన్ రూమ్ టెంట్లు అందించడం మంచి విషయమన్నారు. కార్యక్రమంలో వీడీడీఎంఏ అసోసియేషన్ కార్యదర్శి కరుణ, నృత్య కళాకారులు దుర్గ, సుగుణ, మంజు, నాగు, శివ, ఎర్నిబాబు, మౌనిక, గణేష్, రమ్య, విజయలక్ష్మీ, ప్రసాద్, మణి తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఉత్తరాంధ్ర మహిళా నేత త్రివేణికి ఎమ్మెల్యే వంశీకృష్ణ పరామర్శ

- ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్సీ నాగేంద్రబాబు



త్రివేణి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొంటున్న ఎమ్మెల్యే

వెంకోజీపాలెం, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి) : గత నెలలో గాజువాక పార్టీ కార్యక్రమంలో పాల్గొని ప్రమాదవశాత్తూ కాలు విరిగిపోవడంతో శస్త్రచికిత్స చేయించుకున్న జనసేన ఉత్తరాంధ్ర మహిళా రీజనల్ కో-ఆర్డినేటర్ కంటపల్లి త్రివేణిని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ సీతమ్మధార సమీపంలోని ఆమె స్వగృహంలో శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఎమ్మెల్సీ కె.నాగబాబు ఫోన్ ద్వారా త్రివేణికి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉత్తరాంధ్ర జిల్లా పర్యటనలో భాగంగా విశాఖలో ఏర్పాటు చేసిన వీరమహిళల సమావేశంలో ఈ ప్రమాద విషయాన్ని కొందరు పార్టీ వీర మహిళలు, డాక్టర్ పంచకర్ల సందీప్‌లు ఎమ్మెల్సీ నాగబాబుకు విషయం తెలియజేయగా, ఆయన వంశీకృష్ణ ద్వారా ఫోన్‌లో త్రివేణిని పరామర్శించారు. తనను పరామర్శించిన వారందరికీ త్రివేణి ధన్యవాదాలు తెలిపారు.

బీజేపీ పదాధికారులకు నియామక పత్రాల అందజేత



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షుడు పరశురామ్‌రాజుతో పదాధికారులు

పెదవాల్తేరు, ఆగస్టు (ఆంధ్రజ్యోతి) : నూతనంగా నియమితులైన బీజేపీ జిల్లా పదాధికారులకు నియామిక పత్రాలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, బీజేపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎస్ పరశురామ రాజు బీజేపీ నగర కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్, బీజేపీ రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, బీజేపీ పార్వతీపురం జిల్లా ఇన్‌చార్జి ఎస్వీఎస్ ప్రకాశ్ రెడ్డి, బీజేపీ శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి ఎన్.విజయానంద రెడ్డి, బీజేపీ ఏలూరు ఇన్‌చార్జి బి.నరేంద్రప్రకాశ్, బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎ.కేశవ కాంత్, బీజేపీ రాష్ట్ర ఆర్టీఐ సెల్ కన్వీనర్ వెంగమాంబ శ్రీనివాసబాబు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాడి పురుషోత్తం రమేష్, సిరసపల్లి నూకరాజు, జిల్లా పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

టైమ్ స్కేల్ ఉద్యోగులుగా గుర్తించరూ..

- ఎమ్మెల్యే వెలగపూడికి ఏయూ 28 రోజుల ఉద్యోగులు వినతి



ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఏయూ 28 రోజుల ఉద్యోగులు

సిరిపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును ఆంధ్ర యూనివర్సిటీ 28 రోజుల ఉద్యోగులు శుక్రవారం కలిశారు. తమను టైమ్ స్కేల్ ఉద్యోగులుగా గుర్తించాలని, తమ కుటుంబాలకు కాస్త ఆర్థిక భరోసా లభిస్తుందని కోరారు. ఈ విషయమై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు
- అనకాపల్లి కొత్తూరు జంక్షన్ వద్ద ఘటన



వెంకట సూరిఅప్పారావు (ఫైల్ ఫొటో)



నాగసాయి బాలాజీ (ఫైల్ ఫొటో)

అనకాపల్లి టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణ శివారు కొత్తూరు జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తెలిపిన వివరాల మేరకు... గొలుగొండ మండలం కొత్తపాలేనికి చెందిన గండెం నాగ సాయి బాలాజీ (25) కశింకోట మండలంలోని ఓ సిమెంట్ కంపెనీలో ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. మునగపాక మండలం చినయాదగిరిపాలేనికి చెందిన మేడిశెట్టి వెంకట సూరిఅప్పారావు (28) ఇదే కంపెనీలో సూపర్‌వైజర్, గాజువాకకు చెందిన పైనా రవి క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. కశింకోటలో ఉంటున్నారు. గురువారం రాత్రి తాళ్లపాలెంలో సహోద్యోగి వివాహానికి హాజరయ్యారు. తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై అనకాపల్లి వచ్చి, కశింకోట వెళుతున్నారు. కొత్తూరు జంక్షన్ సమీపంలో విశాఖ వైపు నుంచి వస్తున్న ఐషర్ వ్యాన్, వీరి వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకట సూరిఅప్పారావు అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన నాగ సాయిబాలాజీ, రవిలను ట్రాఫిక్ పోలీసులు ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. చికిత్స పొందుతూ నాగసాయి బాలాజీ మృతిచెందాడు. రవిని విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.


వన్‌టౌన్‌లో స్వర్ణ వస్త్రాలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు


డాబాగార్డెన్స్‌లోని ఉమాదేవి అమ్మవారికి ఫలాలతో అలంకరణ


శివరామకృష్ణ ఆలయంలో దీపారాధనలో పాల్గొన్న మహిళలు


కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు

మహారాణిపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసోత్సవాల సందర్భంగా రెండో శుక్రవారం వన్‌టౌన్‌లోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు స్వర్ణ వస్త్రాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జామున మూలవిరాట్‌కు శుద్ధజలం, పాలు, పెరుగు, తేనె, గంధం, పసుపు, కుంకుమ, వివిధ రకాల పండ్ల రసాలు, 108 సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేకంగా క్షీరాభిషేకం చేశారు. అనంతరం 108 బంగారు పుష్పాలతో నివేదన చేసి అనంతరం స్వర్ణ వస్త్రాలంకరణ చేశాక భక్తులను దర్శనానికి అనుమతించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో సుమారు 250 మంది మహిళలు సామూహిక లలిత సహస్రనామ పారాయణం, కుంకుమ పూజలు నిర్వహించారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్ భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో...

మహారాణిపేట, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ పూజలు ఘనంగా జరుగుతున్నాయి. రెండో శుక్రవారం సందర్భంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన పూజలలో 128 మంది ఉభయదాతలు, భక్తుల సమక్షంలో అర్చకులు, వేద పండితులు కుంకుమ పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో కె శోభారాణి, పలువురు అధికారులు భక్తులకు దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉమాదేవి అమ్మవారికి ఫలాలతో అలంకరణ

డాబాగార్డెన్స్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): డాబాగార్డెన్స్‌లోని దేవదాయ శాఖ శివరామకృష్ణ దేవాలయంలోని ఉమాదేవి అమ్మవారికి శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా వివిధ రకాల ఎండు ఫలాలతో దివ్యంగా అలంకరించారు. ఆలయ అర్చకులు జి.భార్గవశర్మ సంప్రదాయరీతిలో కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సామూహికంగా లలితా సహస్రనామ పారాయణం చేశారు. సాయంత్రం ఆలయంలోని మహిళలు దీపారాధన చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో జీవీ రమాభాయి, సిబ్బంది మన్మథరెడ్డి, గోపి, ఎం.వి.రాజశేఖర్ పాల్గొన్నారు. అందరికీ అర్చన చేసిన కుంకుమ తీర్థ ప్రసాదాలు అందజేశారు. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు ప్రారంభం


ప్రార్థన చేస్తున్న ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ తదితరులు

జ్ఞానాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక పునీతుపేతు ప్రధాన దేవాలయం ఆధ్వర్యంలో ఏటా ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి దేవాలయం విచారణకర్త ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ మరియమాత స్వరూపతేరు వద్ద ప్రత్యేకప్రార్థనలు చేసి దివ్యబలిపూజ నిర్వహించారు. సిలువగుర్తు మండపంలో పీపీసీ అధ్యక్షుడు ముసురు రాజేష్ మహోత్సవ పతాక ఆవిష్కరణ చేశారు. తొలిరోజు జ్ఞానాపురంలోని సెబాస్టియన్ కాలనీ, మరియదాస్ కాలనీ, రావులపల్లి వీధి, వడిచర్ల వీధి, నికోలస్ వీధి, డయాస్, రాసా వీధుల్లో భక్తిశ్రద్ధలతో మరియమాత స్వరూపాన్ని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ పి.విమల్‌రాజ్, ఫాదర్ వై.ప్రేమ్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'శక్తి యాప్' చేతిలో ఉంటే విద్యార్థినులకు అభయం


విద్యార్థినులకు సూచనలు చేస్తున్న ఏసీపీ పృథ్వీతేజ, చిత్రంలో సీఐ రవికుమార్ తదితరులు

కంచరపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ రూపంలో సాంకేతికత చేతిలో ఉన్నందున శక్తియాప్‌ను డౌన్‌లోడు చేసుకుంటే నిర్భయంగా ఉండవచ్చని వెస్ట్ ఏసీపీ పృథ్వీతేజ అన్నారు. విద్యార్థినులు బయటకు వెళ్లినప్పుడు కాస్త అప్రమత్తంగా ఉంటే చాలని, ఎవరైనా ఇబ్బంది పెట్టినా, ఈవ్‌టీజింగ్ చేసినా వెంటనే ఈ యాప్‌ను ఉపయోగిస్తే పోలీసుల సహాయం అందుతుందని భరోసా ఇచ్చారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాల విద్యార్థినులకు శక్తియాప్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వెస్ట్ ఏసీపీ పృథ్వీతేజ హాజరై పలు సూచనలు చేశారు. ర్యాగింగ్‌కు దూరంగా ఉండి చక్కగా చదువుకోవాలన్నారు. మహిళా శక్తియాప్‌ను విద్యార్థినులతో డౌన్‌లోడ్ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ, సీఐ కె.రవికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 14న కళా సంబరాలు

డాబాగార్డెన్స్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో సెప్టెంబరు 14న కళా సంబరాలు నిర్వహిస్తున్నట్టు అకాడమీ వ్యవస్థాపకుడు పీఏ భాస్కరరావు తెలిపారు. వివిధ రంగాల్లో నిస్వార్థంగా సేవలందించిన వారికి విశాఖరత్న అవార్డులు ప్రదానం చేస్తామన్నారు. ఎన్టీ రామారావు, దాసరి నారాయణరావులు తెలుగు సినీ పరిశ్రమకు అందించిన సేవలు నేటి తరానికి తెలియాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. సెప్టెంబరు 14న డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగే కార్యక్రమంలో అవార్డు గ్రహీతలను సన్మానిస్తామన్నారు.

పండగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ


జ్ఞానాపురంలో వృద్ధురాలికి పింఛన్ డబ్బు అందజేస్తున్న దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కూటమి నాయకులు


సోనియాగాంధీనగర్‌లో ఓ వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న జనసేన ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి ఉషాకిరణ్, పాల్గొన్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు తదితరులు

జ్ఞానాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నాయకులు, అధికారులు, సిబ్బంది ఇంటింటికీ వచ్చి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయడంతో అన్నిచోట్ల పండగ వాతావరణం కనిపించింది. ప్రతినెలా ఒకటో తేదీన ఠంచనుగా పింఛన్లు చేతికి ఇస్తుండడంతో వృద్ధులు, అభాగ్యులు, వితంతువుల వదనాల్లో ఆనందం తొణికిసలాడుతోంది. జీవీఎంసీ జోన్-5 పరిధిలోని 41వ వార్డులో కొత్తగా మంజూరైన జీవిత భాగస్వామి పింఛన్లను దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. వార్డులో 11 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బి.రాము, ఏపీడీ పుణ్యవతి, కూటమి నాయకులు ఐతి మధుబాబు, సంజీవరావు, అంతొని శేఖర్, గవర రమణ, భానోజీరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: గ్రేటర్ 43, 45 వార్డుల పరిధిలోని శ్రీనివాసనగర్, సోనియాగాంధీనగర్‌లలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను కూటమి నాయకులతో కలిసి ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పింఛన్లు ప్రజల హక్కు అని, ప్రభుత్వం వారి సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, జోనల్ కమిషనర్ రాము, ఉత్తర నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి ఉషాకిరణ్, కార్పొరేటర్లు పెద్దిశెట్టి ఉషశ్రీ, హనోక్, టీడీపీ వార్డుల అధ్యక్షులు బొడ్డేటి మోహనరావు, భరణికాన రాజు, నాయకులు ముత్యాల నాయుడు, రఘునాథ్, ఆకిరెడ్డి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: సీతంపేట దుర్గాగణపతి ఆలయం వద్ద కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక, ఏపీడీవో రాము, మాజీ కార్పొరేటర్ ఇసరపు వెంకటలక్ష్మి, టీడీపీ వార్డు అధ్యక్షుడు నమ్మి రవికుమార్, నారా కిషోర్, ప్రకాష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కంచరపాలెం: జీవీఎంసీ 48, 54, 56, 57వార్డుల్లో కూటమి నాయకులు ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. 54వ వార్డులో టీడీపీ అధ్యక్షుడు కుట్టా కార్తీక్, పెంటకోట స్రవంతి, 56వ వార్డులో కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, 57వ వార్డులో పెంటకోట అజయ్‌బాబు, 48వ వార్డులో గంకల కవిత, అప్పారావులు పంపిణీ చేశారు.

రైల్వే రన్నింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

» శ్రామిక్ కాంగ్రెస్ డిమాండ్


వాల్తేరు డివిజన్ కార్యాలయం ఆవరణలో దీక్ష చేస్తున్న శ్రామిక్ కాంగ్రెస్ నాయకులు

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తూర్పు కోస్తా రైల్వే రన్నింగ్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తూరుకోస్తా రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ శుక్రవారం వాల్తేరు డివిజన్ ప్రధాన కార్యాలయం ఆవరణలో నిరాహార దీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రన్నింగ్ సిబ్బందికి కనీసం 120 కి.మీ మైలేజీకు హామీ ఇవ్వాలని, త్రికోణ పద్ధతిలో పనిచేయించే విధానాన్ని రద్దు చేయాలని, పని గంటల పరిమితి తొమ్మిది గంటలకు కుదించాలని, రాత్రి షిఫ్టులను రెండు రోజులకు మించి కొనసాగించకూడదని డిమాండ్ చేశారు. అలాగే రైల్వే బోర్డు నిబంధనల ప్రకారం రన్నింగ్ సిబ్బందికి తగినన్ని రూమ్స్ ఏర్పాటు చేయాలని, ఇంజన్ క్యాబిన్‌లలో ఏసీ సదుపాయం, టూల్‌బాక్సు అమర్చాలని డిమాండ్ చేశారు. రన్నింగ్ సిబ్బంది రోజుకు సుమారు 16 గంటలు పనిచేస్తున్నారని, భారతీయ రైల్వేలో అత్యధిక సమయం వాల్తేరు డివిజన్‌కు చెందిన రన్నింగ్ సిబ్బంది పనిచేస్తున్నారని, వాల్తేరు డివిజన్ అత్యధిక లోడింగ్ రికార్డులను సాధించడంలో రన్నింగ్ సిబ్బంది అందిస్తున్న కృషిని యాజమాన్యం గుర్తించి కనీసం 120 కి.మీ మైలేజ్‌కు హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నిరాహార దీక్ష కార్యక్రమంలో నాయకులు జె.సంపత్ కుమార్, టి.వి.మౌళీశ్వరరావు, బ్రాంచి కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వేలో స్వచ్ఛతా అభియాన్ ప్రారంభం


విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో సిబ్బందితో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛతా అభియాన్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి డీఆర్‌ఎం లలిత్ బొహ్రా ముఖ్య అతిథిగా హాజరై స్వచ్ఛభారత్‌లో భాగంగా డివిజన్ వ్యాప్తంగా 15 రోజులు జరిగే పరిశుభ్రతా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ప్లాస్టిక్‌ను నిర్మూలించడమే స్వచ్ఛతా అభియాన్ లక్ష్యమని పేర్కొన్నారు. ఆరోగ్యకర వాతావరణం కల్పించడానికి ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యమైన పరిశుభ్రతను కాపాడతామని అధికారులు, సిబ్బంది, రైల్వే రక్షణ దళం, స్వచ్ఛతా సేవకులు, పారిశుధ్య కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు మనోజ్‌కుమార్ సాహు, ఇ.శాంతారామ్, ప్రవీణ్ భాటి తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌లతోపాటు ప్రవేశ ద్వారాల ప్రాంతాల్లో స్వచ్ఛభారత్‌పై నిర్వహించిన ర్యాలీలో డీఆర్‌ఎం, అధికారులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా 5న మహా ధర్నా


నరసింహనగర్ రోడ్డులో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న ఆటో డ్రైవర్స్ ఫెడరేషన్ నాయకులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న గురుద్వారలోని విద్యుత్‌శాఖ సీఎండీ కార్యాలయం వద్ద నిర్వహించనున్న మహాధర్నాకు తరలి రావాలని ఏపీ ఆటో డ్రైవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.వామనమూర్తి ప్రజలకు పిలుపునిచ్చారు. నరసింహనగర్ రోడ్డులో శుక్రవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపాలని చూడడం దుర్మార్గమన్నారు. విద్యుత్ వినియోగదారులే స్మార్ట్ మీటర్ల వ్యయాన్ని భరించాల్సి ఉంటుందన్నారు. సింగిల్ ఫేజ్ మీటరు ఖరీదు రూ.8,927, త్రీ ఫేజ్ మీటరు ఖరీదు రూ.17,286 అని ఈ మొత్తాన్ని 93 నెలల పాటు విద్యుత్ బిల్లుతో పాటు అదనంగా చెల్లించాల్సి వస్తుందని చెప్పారు. ప్రజలు విద్యుత్ ఎక్కువగా వాడే సమయాల్లో చార్జీలు ఎక్కువగా వసూలు చేస్తారని తెలిపారు. వేసవిలో దీని భారం మరింత ఎక్కువగా ఉంటుందన్నారు. అందువల్ల స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలన్నారు.

స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలి

సీతమ్మధార, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లతో బిల్లులు అధికంగా వస్తాయని, ఆ భారం ప్రజలు భరించలేరని, అందువల్ల వీటిని వ్యతిరేకించాలని సీపీఐ వార్డు కార్యదర్శి పడాల గోవింద్ సూచించారు. సీతమ్మధార, ఏఎస్ఆర్ నగర్, బిలాల్ కాలనీలో ఇంటింటికీ నాయకులు, కార్యకర్తలు వెళ్లి విద్యుత్ స్మార్ట్ మీటర్ల వలన నష్టాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు, కార్యకర్తలు ఎస్.మధురెడ్డి, రమాదేవి, అవనాపు శ్రీను, మురళీ సంతోష్ పాల్గొన్నారు.

లులూ సంస్థకు భూముల కేటాయింపు ఉత్తర్వు రద్దు చేయాలి

» రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకుల డిమాండ్


సీపీఐ కార్యాలయంలో సమావేశమై చర్చిస్తున్న సీపీఐ, సీపీఎం, ఇతర పక్షాల నాయకులు

అల్లిపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బహుళజాతి వ్యాపార సంస్థ లులూ కు ప్రభుత్వ భూములను కారుచౌకగా కట్టబెట్టాల్సిన అవసరం ఏముందని కూటమి ప్రభుత్వాన్ని విపక్ష నాయకులు నిలదీశారు. లులూ సంస్థకు నగరంలో వందలకోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ విశాఖ జిల్లా సమితి శుక్రవారం అల్లిపురంలోని పార్టీ కార్యాలయంలో రాజకీయ పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. అత్యంత విలువైన భూములను కారుచౌకగా కట్టబెట్టే ఉత్తర్వులను వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంస్థ నిర్వహించే మాల్‌లో ఎంతమందికి ఉద్యోగాలు లభిస్తాయో చెప్పకుండా భారీగా ఉపాధి అవకాశాలు వస్తాయనడం ప్రజలను మోసగించడమేనని పేర్కొన్నారు. 13.74 ఎకరాల భూమిని 99 ఏళ్లపాటు అప్పగించడం వెనుక పెద్ద కుంభకోణం ఉందని అనుమానం వ్యక్తంచేశారు. ఆ ఉత్తర్వులు రద్దు చేయకపోతే అన్ని వర్గాలను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు ఎస్.కె. రహమాన్, జగ్గునాయుడు, బి.రంగారావు, ఎం.కొండయ్య, కె.దేవ, ఎం.పైడిరాజు, కె.సత్యనారాయణ, ఎం.మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

రాంకీ యాజమాన్యంపై పీసీబీ ఛైర్మన్ ఆగ్రహం

» ఘన వ్యర్థాల నిర్వహణ తీరుపై అసహనం

పరవాడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఫార్మా ఘన వ్యర్థాల నిర్వహణ తీరుపై ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి.కృష్ణయ్య, రాంకీ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ఫార్మాసిటీలో రాంకీకి చెందిన కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (సీడబ్ల్యూఎంపీ), కోస్టల్ ఎన్విరాన్‌మెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (సీఈటీపీ)లను అధికారులతో కలిసి తనిఖీ చేశారు. సీడబ్ల్యూఎంపీ షెడ్ల వెనుక ప్రదేశంలో నిబంధనలకు విరుద్ధంగా వందల టన్నుల ఘన వ్యర్థాలు నిల్వ ఉండడంపై ఆయన మండిపడ్డారు. పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి విఘాతం కలిగించేలా వ్యవహరించవద్దని హెచ్చరించారు. లోపాలను వెంటనే సరి చేసుకోవాలని సూచించారు. ఫార్మా వ్యర్థాలతో కలుషితంగా మారిన పరవాడ ఉరచెరువు, మల్లోడి వాగు, పరవాడ పెద్ద చెరువును సందర్శించారు. ఆయన వెంట పీసీబీ ఆర్‌డీ సుదర్శన్, ఈఈ ముకుందరావు, సిబ్బంది వున్నారు.

అనుమతి లేని ఫెర్టిలిటీ సెంటర్లపై చర్యలు

... 3వ పేజీ తరువాయి

డ్రై డే పాటించాలని, దోమల ఉత్పత్తి స్థావరాలను గుర్తించి నిర్వీర్యం చేయాలన్నారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, షాపింగ్‌మాల్స్‌లో మిల్క్ ఫీడింగ్ గదులను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. అనంతరం ఎయిడ్స్‌పై జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన కలిగించాలన్నారు. సమీక్ష సమావేశంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, ఐసీడీఎస్ పీడీ రామలక్ష్మి, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

5 ఐటీ సంస్థలకు భూ కేటాయింపులు

... 3వ పేజీ తరువాయి

చెందిన బీవీఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీకి ఎండాడలో పనోరమ హిల్స్ వెనుక ఒకే దగ్గర ఏపీఐఐసీ ద్వారా 30 ఎకరాలు కేటాయించారు. అందులో వరల్డ్ ట్రేడ్ సెంటర్ నిర్మిస్తారు. ఆఫీస్ స్పేస్, కో వర్కింగ్ స్పేస్, ఉద్యోగులకు నివాసాలు, స్టార్ హోటల్ వంటివి నిర్మిస్తారు. వీరి పెట్టుబడి రూ.1,250 కోట్లు కాగా 15 వేల మందికి ఉపాధి కల్పించాలి. ముందుగా సర్వే నంబరు 179/2లో పది ఎకరాలు ఇచ్చారు. ఎకరాకు రూ.1.5 కోట్లు ధర నిర్ణయించారు. వీరు 25 లక్షల చ.అ. విస్తీర్ణంలో నిర్మాణాలు చేపడతారు. కోట్లకే ఇచ్చారు.

- ఫీనమ్ పీపుల్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ఐటీ క్యాంపస్ నిర్మాణానికి ముందుకు రాగా 4.45 ఎకరాలు కేటాయించారు. రుషికొండ హిల్ నంబరు 2లోని నాన్ సెజ్ ఏరియాలో 45 సెంట్లు, మధురవాడ హిల్ నంబరు 4లో నాలుగు ఎకరాలు ఇచ్చారు. ఎకరాకు రూ.4.05 కోట్లు ధర నిర్ణయించారు. వీరి పెట్టుబడి 2078.5 కోట్లు కాగా దశల వారీగా ఐదేళ్లలో 2,500 మందికి ఉద్యోగాలు కల్పించాలి. ఏడాదిలో క్యాంపస్ ఏర్పాటుచేసి, రెండేళ్లలో 1,250 మందికి ఉపాధి చూపించాలి.

ఎంఐజీ లేఅవుట్లకు కొరవడిన ఆదరణ

... 3వ పేజీ తరువాయి

నచ్చింది ఇవ్వకపోతే ఎలా? అంటూ ముందుకురాలేదు. పైగా ఆయా లేఅవుట్లలో అన్ని ప్లాట్లకు ఒకటే ధర నిర్ణయించారు. అంటే రహదారి పక్కన ఉన్నవాటికి, దూరంగా ఉన్నవాటికి ఒకటే ధర పెట్టారు. అది కూడా చాలామందికి నచ్చలేదు. అంతే కాకుండా లేఅవుట్ల అభివృద్ధి పనులు కూడా ఆశించినంత వేగంగా సాగలేదు. దరఖాస్తుదారులు కట్టిన సొమ్ముతో దశల వారీగా మౌలిక వసతులు కల్పిస్తామని అధికారులు చెప్పడంతో చాలామంది వెనక్కి తగ్గారు. చివరికి వాటిని ఆదరణ కరవైంది. కేవలం పాలవలస లేఅవుట్‌లో ప్లాట్లు తీసుకునేందుకు మాత్రమే అత్యధికులు మొగ్గు చూపారు. అది కూడా అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారికి పక్కన ఉండడంతో ప్రభుత్వ ఉద్యోగులు అంతా అక్కడ స్థలం కోసం దరఖాస్తు చేశారు. అందులో 472 ప్లాట్లు ఉండగా 435 కేటాయించేశారు. ఇంకా 37 ఉన్నాయి. రామవరం, గంగసాని అగ్రహారం-1, 2లలో బోణీ పడలేదు. అంటే ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. గరివిడిలో 211 ప్లాట్లకు ముగ్గురు మాత్రమే తీసుకున్నారు. అడ్డూరులోని 146 ప్లాట్లలో 30 మంది తీసుకున్నారు. ఇంకా 116 ఉన్నాయి. మొత్తం ఆరు లేఅవుట్లలో 2,468 ప్లాట్లు వేయగా, 468 అమ్ముడుపోయాయి. ఇంకా 2వేలు ఖాళీగా ఉన్నాయి.

కొత్త మార్గదర్శకాలు

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఎంఐజీ లేఅవుట్లపై కొత్త మార్గదర్శకాలు ఇచ్చింది. ఈ లేఅవుట్లకు మళ్లీ కొత్తగా దరఖాస్తులు స్వీకరించవద్దని స్పష్టం చేసింది. పాత దరఖాస్తులనే బయటకు తీసి, ఆసక్తి చూపిన వారికి లాటరీ ద్వారా కేటాయించాలని పేర్కొంది. అవి పోను ఇంకా మిగిలితే వేలం ద్వారా విక్రయించాలని ఆదేశించింది.

ఇకపై ఎవరైనా కొనుక్కోవచ్చు

ఇకపై ఎంఐజీ ప్లాట్లను వేలంలో విక్రయిస్తారు. ఎవరైనా పాల్గొనవచ్చు. వాటికి నిబంధనలు వర్తించవు. అంటే వార్షిక ఆదాయంపై పరిమితి ఉండదు. పాలవలసలో గజం ధర రూ.14 వేలు పెట్టారు. దాదాపు అన్నీ అయిపోనట్టే. రామవరం, జీఎస్ అగ్రహారం లేఅవుట్లకు ఇంకా ధరలు నిర్ణయించలేదు. రఘుమండలో గజం రూ.6,500 కాగా అడ్డూరులో రూ.4 వేలు పెట్టారు. గరివిడిలో మొదట గజం ధర రూ.7,700 పెట్టి అధికంగా ఉందని ఎవరూ ముందుకు రాకపోవడంతో దానిని రూ.2 వేలు తగ్గించి రూ.5,700 చేశారు.

లాటరీ ద్వారా కేటాయించాలని డిమాండ్

మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధర అని ప్రకటించడం, ఆ తరువాత వేలం పెట్టడం వల్ల ఆ పరిసర ప్రాంత రియల్ ఎస్టేట్ సంస్థలు వాటి ధరలను కావాలనే పెంచేస్తున్నాయి. దాంతో ఎవరికీ అవి అందుబాటులో ఉండడం లేదు. వీఎంఆర్‌డీఏ తన ఖర్చులు, లాభం వేసుకొని లాటరీ ద్వారానే వాటిని విక్రయిస్తే రేట్లు పెరగవు. నచ్చిన వారు కొనుక్కుంటారు. ఇప్పుడు కూడా ఎన్టీఆర్ ఎంఐజీ లేఅవుట్లలో మిగిలిన రెండు వేల ప్లాట్లను కొత్తగా దరఖాస్తులు ఆహ్వానించి లాటరీ ద్వారానే కేటాయించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. వీఎంఆర్‌డీఏ వేలం పాటలు పెట్టి భూముల ధరలు పెంచడం మానుకోవాలని కోరుతున్నాయి. దీనికి ప్రభుత్వం సహకరించడం విచారకరమని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

అమ్మో హోటల్ ఫుడ్!

... 3వ పేజీ తరువాయి

చూసి అధికారులే విస్తుపోయారు.

నగరంలో పలు హోటల్స్ రెస్టారెంట్స్‌లో దారుణ పరిస్థితులు ఉన్నాయని, రోజుల తరబడి నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు వేడి చేసి వడ్డిస్తున్నారని, ఫలితంగా ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని ప్రభుత్వానికి పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. వీటిని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం ఆకస్మికదాడులు నిర్వహించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించింది. ఈ మేరకు ఆహార భద్రత, ప్రమాణాల శాఖ జాయింట్ ఫుడ్ కంట్రోలర్ ఎస్.పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో తూనికలు కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ థామస్ రవికుమార్, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్లు జీపీబీ నందాజీ, చక్రవర్తి, మరో 40 మంది అధికారులు 20 బృందాలుగా విడిపోయి, నగర పరిధిలోని 40 హోటల్స్, రెస్టారెంట్స్‌లో శుక్రవారం ఆకస్మిక దాడులు చేశారు.

అధికారులే షాక్‌కు గురయ్యేలా...

దాడుల్లో అధికారులు షాక్‌కు గురయ్యే పరిస్థితులు కనిపించాయి. అనేకచోట్ల దుర్వాసన వెదజల్లే ఆహార పదార్థాలనే వేడి చేసి కస్టమర్లకు వడ్డిస్తున్నట్టు గుర్తించారు. తనిఖీలు చేసిన హోటల్స్‌లో రోజుల తరబడి నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఇసుకతోటలోని మాయ, ముంతాజ్ హోటళ్లలో రోజుల తరబడి నిల్వ ఉన్న చికెన్, మటన్, రొయ్య తదితర పదార్థాలను వినియోగిస్తున్నట్టు తేలింది. జగదాంబ జంక్షన్ సమీపంలోని ఆల్ఫా హోటల్‌లో ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన ఆహారాన్ని గుర్తించారు. కొన్నిచోట్ల దుర్వాసన వెదజల్లే పదార్థాలను వేడి చేసి కస్టమర్లకు వడ్డించేందుకు సిద్ధం చేస్తున్నట్టు గుర్తించారు. అనేకచోట్ల అపరిశుభ్ర వాతావరణంలో కిచెన్ నిర్వహిస్తున్న తీరు తనిఖీల్లో బయటపడింది. చికెన్, మటన్, చేపలు, రొయ్యల గ్రేవీలు నాలుగు నుంచి ఐదురోజులపాటు నిల్వ ఉంచినవిగా తేల్చారు. అన్ని హోటల్స్‌లో హానికారక రంగులను వినియోగించడంతోపాటు కొన్నిరకాల పిండిపదార్థాలు, ఆయిల్స్ దారుణంగా ఉన్నట్టు అధికారుల తనిఖీల్లో తేలింది.

పరీక్షల నిమిత్తం నమూనాలు

తనిఖీల్లో గుర్తించిన 42 రకాల ఆహార పదార్థాల నమూనాలు సేకరించిన అధికారులు పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీకి పంపించారు. అత్యంత దారుణంగా ఉన్నట్టు నిర్ధారించిన హోటళ్లపై 24 కేసులను నమోదుచేశారు. ల్యాబ్ రిపోర్టుల ఆధారంగా మిగిలిన వాటిపై చర్యలు తీసుకుంటామని జాయింట్ ఫుడ్ కంట్రోలర్ ఎస్.పూర్ణచంద్రరావు తెలిపారు. తనిఖీలను శనివారం కూడా నిర్వహిస్తామన్నారు. కొన్ని హోటల్స్, రెస్టారెంట్స్‌లో అనుమతి లేని తూనిక యంత్రాలను వినియోగిస్తున్నట్టు గుర్తించి కేసులు నమోదు చేశారు.

నెహ్రూనగర్‌లో రేషన్ డిపో ప్రారంభం



రేషన్ డిపో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఆరిలోవ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజాభీష్ట మేరకు వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాలన చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. జీవీఎంసీ 12వ వార్డులోని నెహ్రూనగర్‌లో గురువారం 221 రేషన్ డిపోను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సౌలభ్యం కోసం ఈ ప్రాంతంలో రేషన్ డిపో ప్రారంభించినట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, టీడీపీ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, విశాఖ పార్లమెంటరీ టీడీపీ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 20 వినతులు



వినతులను స్వీకరిస్తున్న చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు

వెంకోజీపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 20 వినతులు వచ్చినట్టు జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన చాంబర్‌లో సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీపీ మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో ప్రజలు పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు తదితర వాటిని ప్రతి శుక్రవారం నమోదు చేసుకోవచ్చన్నారు. వీటిని నిర్దీత సమయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు.

పింఛన్ల పంపిణీ

వెంకోజీపాలెం/ పెదవాల్తేర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డులో టీడీపీ వార్డు అధ్యక్షుడు నారు గోపి, ముగడ వాసు, తూర్పు నియోజకవర్గం టీడీపీ మహిళా అధ్యక్షురాలు పల్లా ఉమారాణి తదితరులు శుక్రవారం పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. అలాగే 20వ వార్డులో టీడీపీ వార్డు అధ్యక్షులు బైరెడ్డి పోతన్నరెడ్డి పెద వాల్తేరు గాంధీబొమ్మ సెంటర్ వద్ద, పెద వాల్తేరు, చినవాల్తేరు తదితర ప్రాంతాల్లో పెన్షన్ల పంపిణీ చేశారు.

సినిమా గైడ్

- **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **కింగ్డమ్** : జగదాంబ
- **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి
- **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **హరిహర వీరమల్లు** : శారద, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 46, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 44, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 32, బీరకాయలు 48, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 20, క్యారెట్ 44, దొండకాయలు 42, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 36,అల్లం (పాతది) 70, బరబాటి 46, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 50, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 30, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడ దుంపలు 44, కంద 42, దేముడు చిక్కుడు 98, గోరు చిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	83
లైవ్ ధర	103
విత్ స్కిన్	176
స్కిన్‌లెస్	186

చాకలిపేటలో ఉద్రిక్తత

- విద్యుత్ సరఫరా నిలిపివేతకు వచ్చిన సిబ్బందిని అడ్డుకున్న స్థానికులు
- కార్పొరేటర్ మూర్తి యాదవ్ వేధింపుల నుంచి రక్షించండి అంటూ ఆందోళన
- దుకాణం తొలగింపు, పెట్రోల్ పోసుకొని నిర్వాహకురాలు ఆత్మహత్యాయత్నం
- కోర్టు ఆదేశాలు ఉన్నా తొలగించడం అన్యాయమంటూ బాధిత మహిళ ఆవేదన

మద్దిలపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పిఠాపురంకాలనీలోగల చాకలిపేటలో శుక్రవారం దుకాణంతో పాటు విద్యుత్ సరఫరా నిలిపివేత వ్యవహారం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. దుకాణం తొలగింపునుప్రతిఘటించిన నిర్వాహకురాలు ఇందుకు కారణం 22వ వార్డు కార్పొరేటర్ మూర్తి యాదవ్ అని ఆరోపిస్తూ తీవ్రంగా రోధిస్తూ శరీరంపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. అక్కడ ఉన్న అధికారులు, స్థానికులు అప్రమత్తమై ఆమె నిప్పు అంటించుకోకుండా నిలువరించారు. కాగా, కార్పొరేటర్ మూర్తి ఆదేశాల మేరకు తాము దుకాణంతో పాటు వికలాంగుడికి చెందిన రేకుల షెడ్డుకు విద్యుత్ సరఫరా తొలగింపునకు వచ్చామని అధికారులు చెప్పడంతో స్థానిక మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ కార్పొరేటర్ మూర్తి యాదవ్ వేధింపుల నుంచి తను రక్షించాలని కోరుతూ నిరసనకు దిగారు. వారికి అధికారులు సర్దిజెప్పి పంపించారు. వివరాలిలా ఉన్నాయి.

చాకలిపేటలోని కనక అనే మహిళ నిర్వహిస్తున్న దుకాణం, వికలాంగుడు శ్రీనివాసరావు నివాసముంటున్న రేకులషెడ్డుకు విద్యుత్ కనెక్షన్ కట్ చేయడానికి టౌన్‌ప్లానింగ్, విద్యుత్ శాఖ సిబ్బంది శుక్రవారం ఉదయం ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అయితే ఇక్కడ అరవై ఏళ్ల నుంచి నివాసముంటున్నామని, కోర్టు ఆర్డర్ కూడా ఉండగా మీరు ఎలా కరెంట్ కట్ చేస్తారని అక్కడి వారంతా సిబ్బందిని నిలదీశారు. కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ కరెంట్ కట్ చేయమన్నారని వారు చెప్పడంతో బాధితులు మండిపడ్డారు. కరెంట్ కట్ చేస్తే ఊరుకోమని భీష్మించారు. అయినా వారు విద్యుత్ కనెక్షన్ కట్ చేసేందుకు ప్రయత్నించగా కనక తన చేతిలోని బాటిల్‌లతో ఉన్న పెట్రోల్‌ను తన ఒంటిపై పోసుకుంది. దుకాణం తొలగిస్తే ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించింది. వెంటనే అక్కడ ఉన్న స్థానికుల కనకను ఒంటిపై నీరు చల్లారు. అనంతరం కార్పొరేటర్ మూర్తి యాదవ్ వేధింపుల నుంచి తమను రక్షించాలని కోరుతూ రోడ్డుపై బైఠాయించారు. అంతలో పోలీసులు, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మధుసూదనరావు, విద్యుత్ శాఖ డీఈ, ఏఈలు అక్కడకు చేరుకున్నారు.రోడ్డుపై బైఠాయించిన మహిళలతో చర్చించారు.

విద్యుత్ కనెక్షన్ తీయమని సర్దిచెప్పారు. కాలువపై అడుగు మేర దుకాణం ఉందని, ఆ మేరకు మాత్రం తొలగిస్తామని నచ్చజెప్పారు. అందుకు వారు సరేననడంతో అడుగు మేర దుకాణం తొలగించాలని సిబ్బందికి ఏసీపీ చెప్పి వెళ్లిపోయారు.అయితే, కాసేపటికి మళ్లీ ఏసీపీ బాధితులకు ఫోన్ చేసి దుకాణం మొత్తం తొలగించాలని కార్పొరేటర్ ఒత్తిడి చేస్తున్నారని, అందుకే దుకాణం మొత్తం తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో దుకాణాన్ని తొలగించారు.



ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి సిద్ధమైన దుకాణ నిర్వాహకురాలు కనక

వరలక్ష్మి అలంకరణలో నూకాంబికా అమ్మవారు



ఆరిలోవ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ, పరిసర ప్రాంతాల్లో శ్రావణ రెండోశుక్రవారంలో భాగంగా వరలక్ష్మీదేవి పూజలను మహిళలు భక్తిశ్రద్ధలతో చేశారు. ఇందు లోభాగంగా పాత డెయిరీ ఫారం వెటర్నరీ కాలనీలో వెలసిన నూకాంబిక అమ్మవారి ఆలయంలో అమ్మవారినివరలక్ష్మిదేవిగా అలంకరించారు. పలు రకాలు పూలు, పండ్లు, పాయసాన్నాలతోను నివేదన చేశారు అధిక సంఖ్యలో భక్తులు పూజలో పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతంలో దోమల నివారణకు చర్యలు

వెంకోజీపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో దోమలు, ఈగలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా 15వ వార్డు సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది శుక్రవారం ఫాగింగ్ నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య ఆధ్వర్యంలో కొండవాలు ప్రాంతంలో వీధి వీధిన ఫాగింగ్ చేశారు. ప్రజలందరూ నీరును నిల్వ ఉండకుండా చూసుకోవాలని, వారానికి ఒక రోజు కుండీలను ఖాళీగా ఉంచాలని, క్రిమికీటకాలు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కార్పొరేటర్ శ్రీవిద్య స్థానికులకు సూచించారు.

బీజేపీ పదాధికారులకు నియామక పత్రాల అందజేత



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షుడు పరశురామ్‌రాజుతో పదాధికారులు

పెదవాల్తేరు, ఆగస్టు (ఆంధ్రజ్యోతి) : నూతనంగా నియమితులైన బీజేపీ జిల్లా పదాధికారులకు నియామిక పత్రాలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, బీజేపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామ రాజు బీజేపీ నగర కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్, బీజేపీ రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, బీజేపీ పార్వతీపురం జిల్లా ఇన్‌చార్జి ఎస్వీఎస్ ప్రకాశ్ రెడ్డి, బీజేపీ శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి ఎన్.విజయానంద రెడ్డి, బీజేపీ ఏలూరు ఇన్‌చార్జి బి.నరేంద్రప్రకాశ్, బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎ.కేశవ కాంత్, బీజేపీ రాష్ట్ర ఆర్టీఐ సెల్ కన్వీనర్ వెంగమాంబ శ్రీనివాసబాబు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాడి పురుషోత్తం రమేష్, సిరసపల్లి నూకరాజు, జిల్లా పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

టైమ్ స్కేల్ ఉద్యోగులుగా గుర్తించరూ..

- ఎమ్మెల్యే వెలగపూడికి ఏయూ 28 రోజుల ఉద్యోగులు వినతి



ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఏయూ 28 రోజుల ఉద్యోగులు

సిరిపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును ఆంధ్ర యూనివర్సిటీ 28 రోజుల ఉద్యోగులు శుక్రవారం కలిశారు. తమను టైమ్ స్కేల్ ఉద్యోగులుగా గుర్తించాలని, తమ కుటుంబాలకు కాస్త ఆర్థిక భరోసా లభిస్తుందని కోరారు. ఈ విషయమై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు
- అనకాపల్లి కొత్తూరు జంక్షన్ వద్ద ఘటన



వెంకట సూరిఅప్పారావు (ఫైల్ ఫొటో)



నాగసాయి బాలాజీ (ఫైల్ ఫొటో)

అనకాపల్లి టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణ శివారు కొత్తూరు జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తెలిపిన వివరాల మేరకు... గొలుగొండ మండలం కొత్తపాలేనికి చెందిన గండెం నాగ సాయి బాలాజీ (25) కశింకోట మండలంలోని ఓ సిమెంట్ కంపెనీలో ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. మునగపాక మండలం చినయాదగిరిపాలేనికి చెందిన మేడిశెట్టి వెంకట సూరిఅప్పారావు (28) ఇదే కంపెనీలో సూపర్‌వైజర్, గాజువాకకు చెందిన పైలా రవి క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. కశింకోటలో ఉంటున్నారు. గురువారం రాత్రి తాళ్లపాలెంలో సహోద్యోగి వివాహానికి హాజరయ్యారు. తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై అనకాపల్లి వచ్చి, కశింకోట వెళుతున్నారు. కొత్తూరు జంక్షన్ సమీపంలో విశాఖ వైపు నుంచి వస్తున్న ఐషర్ వ్యాన్, వీరి వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకట సూరిఅప్పారావు అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన నాగ సాయిబాలాజీ, రవిలను ట్రాఫిక్ పోలీసులు ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. చికిత్స పొందుతూ నాగసాయి బాలాజీ మృతిచెందాడు. రవిని విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

ఫుట్‌పాత్ పనులు అడ్డుకున్న చిరువర్తకులు



ఫుట్‌పాత్ పనులు అడ్డుకుంటున్న తోపుడుబండ్ల వర్తకులు

మద్దిలపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు కళాభారతి రోడ్డులో ఫుట్‌పాత్ నిర్మాణాలను శుక్రవారం చిరు వర్తకులు అడ్డుకున్నారు. కళాభారతి రోడ్డులో 26 తోపుడు బండ్లను వ్యాపారాలు చేసుకోవడానికి కోర్టు స్టేటస్-కో ఇచ్చిందని కాంట్రాక్టర్‌కు తెలిపారు. కోర్టు ఆదేశాలున్న ప్రాంతంలో ఫుట్‌పాత్ నిర్మాణాలు ఏ విధంగా చేస్తారని ప్రశ్నించారు. కళాభారతి రోడ్డులో తోపుడు బండ్ల వ్యాపారాలు తొలిగించడానికే కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఫుట్‌పాత్ ప్రతిపాదనలు చేశారని మండిపడ్డారు. మా వ్యాపారాలు తొలగించి బతుకు లేకుండా చేయడానికి కార్పొరేటర్ అన్నిరకాల ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇంతలో పోలీసులు అక్కడకు చేరుకుని పనులు ఆపుతున్న వర్తకులను చెదరగొట్టారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించండి

- ప్రజలకు పలు ప్రజా సంఘాల ప్రతినిధులు పిలుపు



సమావేశంలో పాల్గొన్న ప్రజా సంఘాల నేతలు, ప్రతినిధులు

ఆరిలోవ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పని చేస్తున్న విద్యుత్ మీటర్లు ఉండగా, అదానికి ప్రయోజనం సిద్ధించే ఉద్దేశంతో స్మార్ట్ మీటర్లను బిగించి ప్రజలపై విపరీతమైన భారాలు వేసే ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉందని, అందుకు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని పలు ప్రజా సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఆరిలోవ ప్రాంతంలో సీఐటీయూసీ, ఏఐటీయూసీ, ఐద్వా, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య మొదలైన ప్రజా సంఘాలు గురువారం ఆరిలోవలో సమావేశమయ్యాయి. ఈ సందర్భంగా ఆయా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ఈ స్మార్ట్ మీటర్ల పేరుతో 93 వాయిదాల్లో విద్యుత్ బిల్లులతో కలసి రూ.9 నుంచి రూ.13 వేలు అదనంగా వసూలు చేసేందుకు ప్రభుత్వం సమాయత్తం అవుతోందని ఆరోపించారు. మరో పక్క పర్దుబాటు చార్జీల పేరుతో ఇప్పటికే ప్రజలపె రూ.15 వేల 485 కోట్ల అదనపు భారం వేశారని విమర్శించారు. తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా, పెంచిన కరెంట్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 2న ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకత్వంలో విద్యుత్ ఏఈ కార్యాలయం వద్ద, ఆగస్టు 5న సీఎండీ కార్యాలయం వద్ద నిరసన నిర్వహిస్తామని ప్రకటించారు. ఇప్పటికే నగరంలో అన్ని వార్డుల్లో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పాదయాత్రలు నిర్వహిస్తూ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని, వాటిని బిగించడానికి వస్తే పగుల గొట్టాలని ప్రచారం చేస్తున్నామని అన్నారు. కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దుచేయకుంటే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు, సీఐటీయూ మద్దిల పాలెం జోన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.నరేంద్రకుమార్, డి.అప్పలరాజు, పి.శంకర్, సీపీఐ ఆరిలోవ ప్రాంత కార్యదర్శి కె.లక్ష్మణరావు, ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు సీహెచ్ కాసుబాబు, ఐద్వా నాయకురాలు వి.శాంతి, కె.కుమారి, ఎన్ఎఫ్ డబ్ల్యూ, మహిళా సంఘం నాయకులు ఎ.దేవుడమ్మ, ఏఐఎఫ్ నాయకులు కె.సంతోష్‌పుష్ప తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను విద్యార్థులకు చేరువ చేయాలి


- ఆచార్య నాగార్జున వర్సిటీ పూర్వ వీసీ బాల మోహన్‌దాస్



కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ బాలమోహన్‌దాస్, ఏయూ మాజీ రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్, ఐఐఏఎం ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : సాంకేతికతను విద్యార్థులకు చేరువ కావడమే లక్ష్యంగా కళాశాలల యాజమాన్యాలు ముందుకు వెళ్లాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వైస్ చాన్సలర్ బాల మోహన్‌దాస్ సూచించారు. ఎంవీపీ కాలనీలోని ఐఐఏఎం కళాశాలలో అడ్మిషన్స్ ఆన్ వీల్ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏయూ మాజీ రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ విద్యార్థులు అడ్మిషన్ కోసం సంస్థ వద్దకు రావాల్సిన అవసరం లేకుండా చేసే కళాశాల వినూత్న ప్రయత్నాన్ని అభినందించారు. సంస్థ డీన్, డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ రవీంద్ర మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థులకు ఉన్నత విద్య అందించడమే లక్ష్యంగా భారతదేశంలో మొదటిసారిగా అడ్మిషన్ ఆన్ వీల్స్ ప్రారంభించినట్టు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాల అందజేత



పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, టీడీపీ యువనేత ప్రతాప రుద్ర

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం పరిధిలోని పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధికి సంబంధించిన మంజూరు పత్రాలను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శుక్రవారం ఎంవీపీ కాలనీలోని ఆయన కార్యాలయంలో అందజేశారు. ఇసుకతోటకు చెందిన పళ్ల అచ్చియ్యమ్మకు రూ 43,727లు, హెచ్‌బీ కాలనీ భానునగర్ ప్రాంతానికి చెందిన చప్ప అప్పలనర్సమ్మ, సాగర్‌నగర్‌కు చెందిన హనుమంతు మోహన్‌రావుకు రూ.1,18,881లు, ఎంవీపీ కాలనీకి చెందిన బలగ కుమారికి రూ.82,095లు చెక్కులను అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారు గోపి, పళ్ల ఉమారాణి, మొల్లి శోభ, మొల్లి శంకర్, ప్రతాప్ రుద్ర వెలగపూడి, కాళ్ల శంకర్, బోర ధనరెడ్డి, గొలగాని మంగవేణి, గేదెల నాగరాజు లావణ్య, నక్క కనకరాజు, తెడ్డురాజు తదితరులు పాల్గొన్నారు.

నృత్య కళాకారిణి కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సహాయం

- వీఎంఆర్డీఏ చైర్మన్ చేతుల మీదుగా అందజేసిన నృత్య కళాకారిణులు



వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ చేతుల మీదుగా నృత్య కళాకారిణి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న దృశ్యం

సిరిపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తూ ఇటీవల మృతి చెందిన మహిళా నృత్య కళాకారిణి రమ కుటుంబాన్ని ఆదుకునేందుకు విశాఖ డ్యాన్సర్, డ్యాన్స్ మాస్టర్స్ అసోసియేషన్‌కు చెందిన మహిళా కళాకారులు రూ.2 లక్షల ఆర్థిక సహాయం చేశారు. ఈ ఆర్థిక సహాయం బాండ్‌ను శుక్రవారం సాయంత్రం వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ చేతుల మీదుగా రమ భర్త అప్పలరాజుకు అందజేశారు. అలాగే మహిళా నృత్య కళాకారులకు ప్రత్యేక ప్రదర్శనల సమయంలో దుస్తులు మార్పు చేసుకునేందుకు వీలుగా ఉండేలా గ్రీన్ రూమ్స్ వంటి సామగ్రిని కూడా అందజేశారు. విశాఖ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ మాస్టర్స్ అసోసియేషన్, కరుణ ఈవెంట్స్ సంయుక్తంగా సామగ్రికి అవసరమైన ఆర్థిక సాయం చేశారు.

ఈ సందర్భంగా వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ తోటి కళాకారుని కుటుంబాన్ని ఆదుకునేందుకు మహిళా కళాకారులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కళాకారులు తన కళ ద్వారా వినోదాన్ని పంచుతారని, అలాంటి నృత్య కళాకారులకు గ్రామీణ ప్రాంతాల్లో ప్రదర్శనలు జరిగిన సమయంలో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అందుకోసం వారికి ప్రయోజనకరంగా ఉండేలా దుస్తులు మార్పులు చేసుకునేందుకు వీలుగా గ్రీన్ రూమ్ టెంట్లు అందించడం మంచి విషయమన్నారు. కార్యక్రమంలో వీడీడీఎంఏ అసోసియేషన్ కార్యదర్శి కరుణ, నృత్య కళాకారులు దుర్గ, సుగుణ, మంజు, నాగు, శివ, ఎర్నిబాబు, మౌనిక, గణేష్, రమ్య, విజయలక్ష్మీ, ప్రసాద్, మణి తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఉత్తరాంధ్ర మహిళా నేత త్రివేణికి ఎమ్మెల్యే వంశీకృష్ణ పరామర్శ

- ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్సీ నాగేంద్రబాబు



త్రివేణి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొంటున్న ఎమ్మెల్యే

వెంకోజీపాలెం, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి) : గత నెలలో గాజువాక పార్టీ కార్యక్రమంలో పాల్గొని ప్రమాదవశాత్తూ కాలు విరిగిపోవడంతో శస్త్రచికిత్స చేయించుకున్న జనసేన ఉత్తరాంధ్ర మహిళా రీజనల్ కో-ఆర్డినేటర్ కంటపల్లి త్రివేణిని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ సీతమ్మధార సమీపంలోని ఆమె స్వగృహంలో శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఎమ్మెల్సీ కె.నాగబాబు ఫోన్ ద్వారా త్రివేణికి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉత్తరాంధ్ర జిల్లా పర్యటనలో భాగంగా విశాఖలో ఏర్పాటు చేసిన వీరమహిళల సమావేశంలో ఈ ప్రమాద విషయాన్ని కొందరు పార్టీ వీర మహిళలు, డాక్టర్ పంచకర్ల సందీప్‌లు ఎమ్మెల్సీ నాగబాబుకు విషయం తెలియజేయగా, ఆయన వంశీకృష్ణ ద్వారా ఫోన్‌లో త్రివేణిని పరామర్శించారు. తనను పరామర్శించిన వారందరికీ త్రివేణి ధన్యవాదాలు తెలిపారు.


వన్‌టౌన్‌లో స్వర్ణ వస్త్రాలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు


డాబాగార్డెన్స్‌లోని ఉమాదేవి అమ్మవారికి ఫలాలతో అలంకరణ


శివరామకృష్ణ ఆలయంలో దీపారాధనలో పాల్గొన్న మహిళలు


కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు

మహారాణిపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసోత్సవాల సందర్భంగా రెండో శుక్రవారం వన్‌టౌన్‌లోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు స్వర్ణ వస్త్రాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జామున మూలవిరాట్‌కు శుద్ధజలం, పాలు, పెరుగు, తేనె, గంధం, పసుపు, కుంకుమ, వివిధ రకాల పండ్ల రసాలు, 108 సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేకంగా క్షీరాభిషేకం చేశారు. అనంతరం 108 బంగారు పుష్పాలతో నివేదన చేసి అనంతరం స్వర్ణ వస్త్రాలంకరణ చేశాక భక్తులను దర్శనానికి అనుమతించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో సుమారు 250 మంది మహిళలు సామూహిక లలిత సహస్రనామ పారాయణం, కుంకుమ పూజలు నిర్వహించారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్ భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో...

మహారాణిపేట, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ పూజలు ఘనంగా జరుగుతున్నాయి. రెండో శుక్రవారం సందర్భంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన పూజలలో 128 మంది ఉభయదాతలు, భక్తుల సమక్షంలో అర్చకులు, వేద పండితులు కుంకుమ పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో కె శోభారాణి, పలువురు అధికారులు భక్తులకు దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉమాదేవి అమ్మవారికి ఫలాలతో అలంకరణ

డాబాగార్డెన్స్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): డాబాగార్డెన్స్‌లోని దేవదాయ శాఖ శివరామకృష్ణ దేవాలయంలోని ఉమాదేవి అమ్మవారికి శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా వివిధ రకాల ఎండు ఫలాలతో దివ్యంగా అలంకరించారు. ఆలయ అర్చకులు జి.భార్గవశర్మ సంప్రదాయరీతిలో కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సామూహికంగా లలితా సహస్రనామ పారాయణం చేశారు. సాయంత్రం ఆలయంలోని మహిళలు దీపారాధన చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో జీవీ రమాభాయి, సిబ్బంది మన్మథరెడ్డి, గోపి, ఎం.వి.రాజశేఖర్ పాల్గొన్నారు. అందరికీ అర్చన చేసిన కుంకుమ తీర్థ ప్రసాదాలు అందజేశారు. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు ప్రారంభం


ప్రార్థన చేస్తున్న ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ తదితరులు

జ్ఞానాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక పునీతుపేతు ప్రధాన దేవాలయం ఆధ్వర్యంలో ఏటా ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి దేవాలయం విచారణకర్త ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ మరియమాత స్వరూపతేరు వద్ద ప్రత్యేకప్రార్థనలు చేసి దివ్యబలిపూజ నిర్వహించారు. సిలువగుర్తు మండపంలో వీపీసీ అధ్యక్షుడు ముసురు రాజేష్ మహోత్సవ పతాక ఆవిష్కరణ చేశారు. తొలిరోజు జ్ఞానాపురంలోని సెబాస్టియన్ కాలనీ, మరియదాస్ కాలనీ, రావులపల్లి వీధి, వడిచర్ల వీధి, నికోలస్ వీధి, డయాస్, రాసా వీధుల్లో భక్తిశ్రద్ధలతో మరియమాత స్వరూపాన్ని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ పి.విమల్‌రాజ్, ఫాదర్ వై.ప్రేమ్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం


వెంకట సూరి అప్పారావు (ఫైల్ ఫొటో)


నాగసాయి బాలాజీ (ఫైల్ ఫొటో)

అనకాపల్లి టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణ శివారు కొత్తూరు జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ సీఐ ఎం. వెంకటనారాయణ తెలిపిన వివరాల మేరకు... గొలుగొండ మండలం కొత్తపాలేనికి చెందిన గండెం నాగసాయి బాలాజీ (25) కశింకోట మండలంలోని సిమెంట్ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. మునగపాక మండలం చినయాదగిరిపాలేనికి చెందిన మేడిశెట్టి వెంకట సూరిఅప్పారావు (28) ఇదే కంపెనీలో సూపర్‌వైజర్, గాజువాకకు చెందిన పైనా రవి క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. కశింకోటలో ఉంటున్నారు. గురువారం రాత్రి తాళ్లపాలెంలో సహోద్యోగి వివాహానికి హాజరయ్యారు. తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై అనకాపల్లి వచ్చి, కశింకోట వెళుతున్నారు. కొత్తూరు జంక్షన్ సమీపంలో విశాఖ వైపు నుంచి వస్తున్న ఐషర్ వ్యాన్, వీరి వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకట సూరిఅప్పారావు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన నాగ సాయిబాలాజీ, రవిలను ట్రాఫిక్ పోలీసులు ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. చికిత్స పొందుతూ నాగసాయి బాలాజీ మృతిచెందాడు. రవిని విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

సెప్టెంబరు 14న కళా సంబరాలు

డాబాగార్డెన్స్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో సెప్టెంబరు 14న కళా సంబరాలు నిర్వహిస్తున్నట్టు అకాడమీ వ్యవస్థాపకుడు భాస్కరరావు తెలిపారు. పలువురికి విశాఖరత్న అవార్డులు ప్రదానం చేస్తామన్నారు.

పండగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ


జ్ఞానాపురంలో వృద్ధురాలికి పింఛన్ డబ్బు అందజేస్తున్న దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కూటమి నాయకులు


సోనియాగాంధీనగర్‌లో ఓ వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న జనసేన ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి ఉషాకిరణ్, పాల్గొన్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు తదితరులు

జ్ఞానాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నాయకులు, అధికారులు, సిబ్బంది ఇంటింటికీ వచ్చి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయడంతో అన్నిచోట్ల పండగ వాతావరణం కనిపించింది. ప్రతినెలా ఒకటో తేదీన ఠంచనుగా పింఛన్లు చేతికి ఇస్తుండడంతో వృద్ధులు, అభాగ్యులు, వితంతువుల వదనాల్లో ఆనందం తొణికిసలాడుతోంది. జీవీఎంసీ జోన్-5 పరిధిలోని 41వ వార్డులో కొత్తగా మంజూరైన జీవిత భాగస్వామి పింఛన్లను దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. వార్డులో 11 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బి.రాము, ఏపీడీ పుణ్యవతి, కూటమి నాయకులు ఐతి మధుబాబు, సంజీవరావు, అంతొని శేఖర్, గవర రమణ, భానోజీరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: గ్రేటర్ 43, 45 వార్డుల పరిధిలోని శ్రీనివాసనగర్, సోనియాగాంధీనగర్‌లలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను కూటమి నాయకులతో కలిసి ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పింఛన్లు ప్రజల హక్కు అని, ప్రభుత్వం వారి సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, జోనల్ కమిషనర్ రాము, ఉత్తర నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జ్ ఉషాకిరణ్, కార్పొరేటర్లు పెద్దిశెట్టి ఉషశ్రీ, హనోక్, టీడీపీ వార్డుల అధ్యక్షులు బొడ్డేటి మోహనరావు, భరణికాన రాజు, నాయకులు ముత్యాల నాయుడు, రఘునాథ్, అకిరెడ్డి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: సీతంపేట దుర్గాగణపతి ఆలయం వద్ద కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక, ఏపీడీవో రాము, మాజీ కార్పొరేటర్ ఇసరపు వెంకటలక్ష్మి, టీడీపీ వార్డు అధ్యక్షుడు నమ్మి రవికుమార్, నారా కిషోర్, ప్రకాష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కంచరపాలెం: జీవీఎంసీ 48, 54, 56, 57వార్డుల్లో కూటమి నాయకులు ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. 54వ వార్డులో టీడీపీ అధ్యక్షుడు కుట్టా కార్తీక్, పెంటకోట స్రవంతి, 56వ వార్డులో కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, 57వ వార్డులో పెంటకోట అజయ్‌బాబు, 48వ వార్డులో గంకల కవిత, అప్పారావులు పంపిణీ చేశారు.

రైల్వే రన్నింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

» శ్రామిక్ కాంగ్రెస్ డిమాండ్


వాల్తేరు డివిజన్ కార్యాలయం ఆవరణలో దీక్ష చేస్తున్న శ్రామిక్ కాంగ్రెస్ నాయకులు

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తూర్పు కోస్తా రైల్వే రన్నింగ్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తూరుకోస్తా రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ శుక్రవారం వాల్తేరు డివిజన్ ప్రధాన కార్యాలయం ఆవరణలో నిరాహార దీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రన్నింగ్ సిబ్బందికి కనీసం 120 కి.మీ మైలేజ్‌కు హామీ ఇవ్వాలని, త్రికోణ పద్ధతిలో పనిచేయించే విధానాన్ని రద్దు చేయాలని, పని గంటల పరిమితి తొమ్మిది గంటలకు కుదించాలని, రాత్రి షిఫ్టులను రెండు రోజులకు మించి కొనసాగించకూడదని డిమాండ్ చేశారు. అలాగే రైల్వే బోర్డు నిబంధనల ప్రకారం రన్నింగ్ సిబ్బందికి తగినన్ని రూమ్స్ ఏర్పాటు చేయాలని, ఇంజన్ క్యాబిన్‌లలో ఏసీ సదుపాయం, టూల్‌బాక్సు అమర్చాలని డిమాండ్ చేశారు. రన్నింగ్ సిబ్బంది రోజుకు సుమారు 16 గంటలు పనిచేస్తున్నారని, భారతీయ రైల్వేలో అత్యధిక సమయం వాల్తేరు డివిజన్‌కు చెందిన రన్నింగ్ సిబ్బంది పనిచేస్తున్నారని, వాల్తేరు డివిజన్ అత్యధిక లోడింగ్ రికార్డులను సాధించడంలో రన్నింగ్ సిబ్బంది అందిస్తున్న కృషిని యాజమాన్యం గుర్తించి కనీసం 120 కి.మీ మైలేజ్‌కు హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నిరాహార దీక్ష కార్యక్రమంలో నాయకులు జె.సంపత్ కుమార్, టి.వి.మౌళీశ్వరరావు, బ్రాంచి కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వేలో స్వచ్ఛతా అభియాన్ ప్రారంభం


విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో సిబ్బందితో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛతా అభియాన్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి డీఆర్‌ఎం లలిత్ బొహ్రా ముఖ్య అతిథిగా హాజరై స్వచ్ఛభారత్‌లో భాగంగా డివిజన్ వ్యాప్తంగా 15 రోజులు జరిగే పరిశుభ్రతా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ప్లాస్టిక్‌ను నిర్మూలించడమే స్వచ్ఛతా అభియాన్ లక్ష్యమని పేర్కొన్నారు. ఆరోగ్యకర వాతావరణం కల్పించడానికి ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యమైన పరిశుభ్రతను కాపాడతామని అధికారులు, సిబ్బంది, రైల్వే రక్షణ దళం, స్వచ్ఛతా సేవకులు, పారిశుధ్య కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు మనోజ్‌కుమార్ సాహు, ఇ.శాంతారామ్, ప్రవీణ్ భాటి తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌లతోపాటు ప్రవేశ ద్వారాల ప్రాంతాల్లో స్వచ్ఛభారత్‌పై నిర్వహించిన ర్యాలీలో డీఆర్‌ఎం, అధికారులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా 5న మహా ధర్నా


నరసింహనగర్ రోడ్డులో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న ఆటో డ్రైవర్స్ ఫెడరేషన్ నాయకులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న గురుద్వారలోని విద్యుత్‌శాఖ సీఎండీ కార్యాలయం వద్ద నిర్వహించనున్న మహాధర్నాకు తరలి రావాలని ఏపీ ఆటో డ్రైవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.వామనమూర్తి ప్రజలకు పిలుపునిచ్చారు. నరసింహనగర్ రోడ్డులో శుక్రవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపాలని చూడడం దుర్మార్గమన్నారు. విద్యుత్ వినియోగదారులే స్మార్ట్ మీటర్ల వ్యయాన్ని భరించాల్సి ఉంటుందన్నారు. సింగిల్ ఫేజ్ మీటరు ఖరీదు రూ.8,927, త్రీ ఫేజ్ మీటరు ఖరీదు రూ.17,286 అని ఈ మొత్తాన్ని 93 నెలల పాటు విద్యుత్ బిల్లుతో పాటు అదనంగా చెల్లించాల్సి వస్తుందని చెప్పారు. ప్రజలు విద్యుత్ ఎక్కువగా వాడే సమయాల్లో చార్జీలు ఎక్కువగా వసూలు చేస్తారని తెలిపారు. వేసవిలో దీని భారం మరింత ఎక్కువగా ఉంటుందన్నారు. అందువల్ల స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలన్నారు.

స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలి

సీతమ్మధార, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లతో బిల్లులు అధికంగా వస్తాయని, ఆ భారం ప్రజలు భరించలేరని, అందువల్ల వీటిని వ్యతిరేకించాలని సీపీఐ వార్డు కార్యదర్శి పడాల గోవింద్ సూచించారు. సీతమ్మధార, ఏఎస్‌ఆర్ నగర్, బిలాల్ కాలనీలో ఇంటింటికీ నాయకులు, కార్యకర్తలు వెళ్లి విద్యుత్ స్మార్ట్ మీటర్ల వలన నష్టాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు, కార్యకర్తలు ఎస్.మధురెడ్డి, రమాదేవి, అవనాపు శ్రీను, మురళీ సంతోష్ పాల్గొన్నారు.

లులూ సంస్థకు భూముల కేటాయింపు ఉత్తర్వు రద్దు చేయాలి

» రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకుల డిమాండ్


సీపీఐ కార్యాలయంలో సమావేశమై చర్చిస్తున్న సీపీఐ, సీపీఎం, ఇతర పక్షాల నాయకులు

అల్లిపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బహుళజాతి వ్యాపార సంస్థ లులూ కు ప్రభుత్వ భూములను కారుచౌకగా కట్టబెట్టాల్సిన అవసరం ఏముందని కూటమి ప్రభుత్వాన్ని విపక్ష నాయకులు నిలదీశారు. లులూ సంస్థకు నగరంలో వందలకోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ విశాఖ జిల్లా సమితి శుక్రవారం అల్లిపురంలోని పార్టీ కార్యాలయంలో రాజకీయ పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. అత్యంత విలువైన భూములను కారుచౌకగా కట్టబెట్టే ఉత్తర్వులను వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంస్థ నిర్వహించే మాల్‌లో ఎంతమందికి ఉద్యోగాలు లభిస్తాయో చెప్పకుండా భారీగా ఉపాధి అవకాశాలు వస్తాయనడం ప్రజలను మోసగించడమేనని పేర్కొన్నారు. 13.74 ఎకరాల భూమిని 99 ఏళ్లపాటు అప్పగించడం వెనుక పెద్ద కుంభకోణం ఉందని అనుమానం వ్యక్తంచేశారు. ఆ ఉత్తర్వులు రద్దు చేయకపోతే అన్ని వర్గాలను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు ఎస్.కె. రహమాన్, జగ్గునాయుడు, బి.రంగారావు, ఎం.కొండయ్య, కె.దేవ, ఎం.పైడిరాజు, కె.సత్యనారాయణ, ఎం.మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

రాంకీ యాజమాన్యంపై పీసీబీ చైర్మన్ ఆగ్రహం

» ఘన వ్యర్థాల నిర్వహణ తీరుపై అసహనం

పరవాడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఫార్మా ఘన వ్యర్థాల నిర్వహణ తీరుపై ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య, రాంకీ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ఫార్మాసిటీలో రాంకీకి చెందిన కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (సీడబ్ల్యూఎంపీ), కోస్టల్ ఎన్విరాన్‌మెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (సీఈటీపీ)లను అధికారులతో కలిసి తనిఖీ చేశారు. సీడబ్ల్యూఎంపీ షెడ్ల వెనుక ప్రదేశంలో నిబంధనలకు విరుద్ధంగా వందల టన్నుల ఘన వ్యర్థాలు నిల్వ ఉండడంపై ఆయన మండిపడ్డారు. పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి విఘాతం కలిగించేలా వ్యవహరించవద్దని హెచ్చరించారు. లోపాలను వెంటనే సరి చేసుకోవాలని సూచించారు. ఫార్మా వ్యర్థాలతో కలుషితంగా మారిన పరవాడ ఉరచెరువు, మల్లోడి వాగు, పరవాడ పెద్ద చెరువును సందర్శించారు. ఆయన వెంట పీసీబీ ఆర్‌డీ సుదర్శన్, ఈఈ ముకుందరావు, సిబ్బంది వున్నారు.

అనుమతి లేని ఫెర్టిలిటీ సెంటర్లపై చర్యలు

... 3వ పేజీ తరువాయి

డ్రై డే పాటించాలని, దోమల ఉత్పత్తి స్థావరాలను గుర్తించి నిర్వీర్యం చేయాలన్నారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, షాపింగ్‌మాల్స్‌లో మిల్క్ ఫీడింగ్ గదులను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. అనంతరం ఎయిడ్స్‌పై జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన కలిగించాలన్నారు. సమీక్ష సమావేశంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, ఐసీడీఎస్ పీడీ రామలక్ష్మి, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

5 ఐటీ సంస్థలకు భూ కేటాయింపులు

... 3వ పేజీ తరువాయి

చెందిన బీవీఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీకి ఎండాడలో పనోరమ హిల్స్ వెనుక ఒకే దగ్గర ఏపీఐఐసీ ద్వారా 30 ఎకరాలు కేటాయించారు. అందులో వరల్డ్ ట్రేడ్ సెంటర్ నిర్మిస్తారు. ఆఫీస్ స్పేస్, కో వర్కింగ్ స్పేస్, ఉద్యోగులకు నివాసాలు, స్టార్ హోటల్ వంటివి నిర్మిస్తారు. వీరి పెట్టుబడి రూ.1,250 కోట్లు కాగా 15 వేల మందికి ఉపాధి కల్పించాలి. ముందుగా సర్వే నంబరు 179/2లో పది ఎకరాలు ఇచ్చారు. ఎకరాకు రూ.1.5 కోట్లు ధర నిర్ణయించారు. వీరు 25 లక్షల చ.అ. విస్తీర్ణంలో నిర్మాణాలు చేపడతారు. కోట్లకే ఇచ్చారు.

- ఫీనమ్ పీపుల్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ఐటీ క్యాంపస్ నిర్మాణానికి ముందుకు రాగా 4.45 ఎకరాలు కేటాయించారు. రుషికొండ హిల్ నంబరు 2లోని నాన్ సెజ్ ఏరియాలో 45 సెంట్లు, మధురవాడ హిల్ నంబరు 4లో నాలుగు ఎకరాలు ఇచ్చారు. ఎకరాకు రూ.4.05 కోట్లు ధర నిర్ణయించారు. వీరి పెట్టుబడి 2078.5 కోట్లు కాగా దశల వారీగా ఐదేళ్లలో 2,500 మందికి ఉద్యోగాలు కల్పించాలి. ఏడాదిలో క్యాంపస్ ఏర్పాటుచేసి, రెండేళ్లలో 1,250 మందికి ఉపాధి చూపించాలి.

ఎంఐజీ లేఅవుట్లకు కొరవడిన ఆదరణ

... 3వ పేజీ తరువాయి

నచ్చింది ఇవ్వకపోతే ఎలా? అంటూ ముందుకురాలేదు. పైగా ఆయా లేఅవుట్లలో అన్ని ప్లాట్లకు ఒకటే ధర నిర్ణయించారు. అంటే రహదారి పక్కన ఉన్నవాటికి, దూరంగా ఉన్నవాటికి ఒకటే ధర పెట్టారు. అది కూడా చాలామందికి నచ్చలేదు. అంతేకాకుండా లేఅవుట్ల అభివృద్ధి పనులు కూడా ఆశించినంత వేగంగా సాగలేదు. దరఖాస్తుదారులు కట్టిన సొమ్ముతో దశల వారీగా మౌలిక వసతులు కల్పిస్తామని అధికారులు చెప్పడంతో చాలామంది వెనక్కి తగ్గారు. చివరికి వాటిని ఆదరణ కరవైంది. కేవలం పాలవలస లేఅవుట్‌లో ప్లాట్లు తీసుకునేందుకు మాత్రమే అత్యధికులు మొగ్గు చూపారు. అది కూడా అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారికి పక్కన ఉండడంతో ప్రభుత్వ ఉద్యోగులు అంతా అక్కడ స్థలం కోసం దరఖాస్తు చేశారు. అందులో 472 ప్లాట్లు ఉండగా 435 కేటాయించేశారు. ఇంకా 37 ఉన్నాయి. రామవరం, గంగసాని అగ్రహారం-1, 2లలో బోణీ పడలేదు. అంటే ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. గరివిడిలో 211 ప్లాట్లకు ముగ్గురు మాత్రమే తీసుకున్నారు. అడ్డూరులోని 146 ప్లాట్లలో 30 మంది తీసుకున్నారు. ఇంకా 116 ఉన్నాయి. మొత్తం ఆరు లేఅవుట్లలో 2,468 ప్లాట్లు వేయగా, 468 అమ్ముడుపోయాయి. ఇంకా 2వేలు ఖాళీగా ఉన్నాయి.

కొత్త మార్గదర్శకాలు

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఎంఐజీ లేఅవుట్లపై కొత్త మార్గదర్శకాలు ఇచ్చింది. ఈ లేఅవుట్లకు మళ్లీ కొత్తగా దరఖాస్తులు స్వీకరించవద్దని స్పష్టం చేసింది. పాత దరఖాస్తులనే బయటకు తీసి, ఆసక్తి చూపిన వారికి లాటరీ ద్వారా కేటాయించాలని పేర్కొంది. అవి పోను ఇంకా మిగిలితే వేలం ద్వారా విక్రయించాలని ఆదేశించింది.

ఇకపై ఎవరైనా కొనుక్కోవచ్చు

ఇకపై ఎంఐజీ ప్లాట్లను వేలంలో విక్రయిస్తారు. ఎవరైనా పాల్గొనవచ్చు. వాటికి నిబంధనలు వర్తించవు. అంటే వార్షిక ఆదాయంపై పరిమితి ఉండదు. పాలవలసలో గజం ధర రూ.14 వేలు పెట్టారు. దాదాపు అన్నీ అయిపోనట్టే. రామవరం, జీఎస్ అగ్రహారం లేఅవుట్లకు ఇంకా ధరలు నిర్ణయించలేదు. రఘుమండలో గజం రూ.6,500 కాగా అడ్డూరులో రూ.4 వేలు పెట్టారు. గరివిడిలో మొదట గజం ధర రూ.7,700 పెట్టి అధికంగా ఉందని ఎవరూ ముందుకు రాకపోవడంతో దానిని రూ.2 వేలు తగ్గించి రూ.5,700 చేశారు.

లాటరీ ద్వారా కేటాయించాలని డిమాండ్

మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధర అని ప్రకటించడం, ఆ తరువాత వేలం పెట్టడం వల్ల ఆ పరిసర ప్రాంత రియల్ ఎస్టేట్ సంస్థలు వాటి ధరలను కావాలనే పెంచేస్తున్నాయి. దాంతో ఎవరికీ అవి అందుబాటులో ఉండడం లేదు. వీఎంఆర్‌డీఏ తన ఖర్చులు, లాభం వేసుకొని లాటరీ ద్వారానే వాటిని విక్రయిస్తే రేట్లు పెరగవు. నచ్చిన వారు కొనుక్కుంటారు. ఇప్పుడు కూడా ఎన్టీఆర్ ఎంఐజీ లేఅవుట్లలో మిగిలిన రెండు వేల ప్లాట్లను కొత్తగా దరఖాస్తులు ఆహ్వానించి లాటరీ ద్వారానే కేటాయించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. వీఎంఆర్‌డీఏ వేలం పాటలు పెట్టి భూముల ధరలు పెంచడం మానుకోవాలని కోరుతున్నాయి. దీనికి ప్రభుత్వం సహకరించడం విచారకరమని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

అమ్మో హోటల్ ఫుడ్!

... 3వ పేజీ తరువాయి

చూసి అధికారులే విస్తుపోయారు.

నగరంలో పలు హోటల్స్, రెస్టారెంట్స్‌లో దారుణ పరిస్థితులు ఉన్నాయని, రోజుల తరబడి నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు వేడి చేసి వడ్డిస్తున్నారని, ఫలితంగా ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని ప్రభుత్వానికి పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. వీటిని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం ఆకస్మికదాడులు నిర్వహించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించింది. ఈ మేరకు ఆహార భద్రత, ప్రమాణాల శాఖ జాయింట్ ఫుడ్ కంట్రోలర్ ఎస్.పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో తూనికలు కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ థామస్ రవికుమార్, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్లు జీబీ నందాజీ, చక్రవర్తి, మరో 40 మంది అధికారులు 20 బృందాలుగా విడిపోయి, నగర పరిధిలోని 40 హోటల్స్, రెస్టారెంట్స్‌లో శుక్రవారం ఆకస్మిక దాడులు చేశారు.

అధికారులే షాక్‌కు గురయ్యేలా...

దాడుల్లో అధికారులు షాక్‌కు గురయ్యే పరిస్థితులు కనిపించాయి. అనేకచోట్ల దుర్వాసన వెదజల్లే ఆహార పదార్థాలనే వేడి చేసి కస్టమర్లకు వడ్డిస్తున్నట్టు గుర్తించారు. తనిఖీలు చేసిన హోటల్స్‌లో రోజుల తరబడి నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఇసుకతోటలోని మాయ, ముంతాజ్ హోటళ్లలో రోజుల తరబడి నిల్వ ఉన్న చికెన్, మటన్, రొయ్య తదితర పదార్థాలను వినియోగిస్తున్నట్టు తేలింది. జగదాంబ జంక్షన్ సమీపంలోని ఆల్ఫా హోటల్‌లో ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన ఆహారాన్ని గుర్తించారు. కొన్నిచోట్ల దుర్వాసన వెదజల్లే పదార్థాలను వేడి చేసి కస్టమర్లకు వడ్డించేందుకు సిద్ధం చేస్తున్నట్టు గుర్తించారు. అనేకచోట్ల అపరిశుభ్ర వాతావరణంలో కిచెన్ నిర్వహిస్తున్న తీరు తనిఖీల్లో బయటపడింది. చికెన్, మటన్, చేపలు, రొయ్యల గ్రేవీలు నాలుగు నుంచి ఐదురోజులపాటు నిల్వ ఉంచినవిగా తేల్చారు. అన్ని హోటల్స్‌లో హానికారక రంగులను వినియోగించడంతోపాటు కొన్నిరకాల పిండిపదార్థాలు, ఆయిల్స్ దారుణంగా ఉన్నట్టు అధికారుల తనిఖీల్లో తేలింది.

పరీక్షల నిమిత్తం నమూనాలు

తనిఖీల్లో గుర్తించిన 42 రకాల ఆహార పదార్థాల నమూనాలు సేకరించిన అధికారులు పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీకి పంపించారు. అత్యంత దారుణంగా ఉన్నట్టు నిర్ధారించిన హోటళ్లపై 24 కేసులను నమోదుచేశారు. ల్యాబ్ రిపోర్టుల ఆధారంగా మిగిలిన వాటిపై చర్యలు తీసుకుంటామని జాయింట్ ఫుడ్ కంట్రోలర్ ఎస్.పూర్ణచంద్రరావు తెలిపారు. తనిఖీలను శనివారం కూడా నిర్వహిస్తామన్నారు. కొన్ని హోటల్స్, రెస్టారెంట్స్‌లో అనుమతి లేని తూనిక యంత్రాలను వినియోగిస్తున్నట్టు గుర్తించి కేసులు నమోదు చేశారు.

జాతీయ బాక్సింగ్ పోటీలకు వడ్డాది అలేఖ్య



వడ్డాది అలేఖ్య

సింధియా, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6 నుంచి 13వరకు ఉత్తరప్రదేశ్‌లో నిర్వహిస్తున్న జాతీయ సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీలకు కేంద్రీయ విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్న వడ్డాది అలేఖ్య ఎంపి కయ్యారు. ఈ నేపథ్యంలో పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేస్తోంది. అలేఖ్య తండ్రీ, తాతాయ్య బాక్సర్లు కావడంతో తను కూడా బాక్సింగ్ మీద మక్కువ పెంచుకు న్నానని తెలిపారు. జాతీయ పోటీలకు సిద్ధంగా ఉన్నానని అలేఖ్య తెలిపారు. ఈ సందర్భంగా ద్రోణాచార్య అవార్డు గ్రహిత వెంకటేశ్వరరావు, కుటుంబ సభ్యులు, పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

శానిటరీ కిట్ల పంపిణీ

సింధియా, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజలకు అందుబాటు ఉంటూ వార్డులను పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుధ్య కార్మికుల సేవలు మరువ లేని వని 63వ వార్డు కార్పొరేటర్ గల్లా పోలిపల్లి (చిన్నా) కొనియాడారు. ఈ సందర్భంగా జైంద్రకాలనీలో పారిశుధ్య కార్మికులకు ఆయన శానిటరీ సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, వార్డు అధ్యక్షుడు జెర్రిపోతుల నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : వ్యాధులు వచ్చిన తరువాత చికిత్స కన్నా వాటిని నిర్మూలించడానికి కృషి చేయడమే ఉత్తమమని గాజువాక జోన్ ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 68వ వార్డులో 'ఫ్రైడే-డ్రైడే' కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ పరిసరా లను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మించడానికి అం దరూ సహకరించాలని కోరారు. ఈ కార్య క్రమంలో టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షు రాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి, శానిటరీ సూ పర్‌వైజర్ కోటేశ్వరరావు, తదితరలు పాల్గొన్నారు.

మండల ప్రత్యేకాధికారిగా సునీతారాణి

పెదగంట్యాడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు స్టీల్ ప్లాంట్ భూ సేకరణ అధికారిగా సేవలందించి, మండల ప్రత్యేకాధికారిగా నియమితులైన డి. సునితారాణిని ఉక్కు నిర్వాసిత నాయకులు శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారిగా ఉన్నత సేవలు అందించాలని కోరారు. నిర్వాసిత నిరుద్యోగులకు స్టీల్ ప్లాంట్‌లో కానీ, దాని అనుబంధ సంస్థల్లో కానీ, ఉపాధీ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉక్కు నిర్వాసిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

పెందుర్తి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముదపాక గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు, వారికి నగరంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ నియోజవర్గ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి.

సినిమా గైడ్

- **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **కింగ్డమ్** : జగదాంబ
- **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి
- **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **హరిహర వీరమల్లు** : శారద, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21,టమాటా 46, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 44, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 32, బీరకాయలు 48, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 20, క్యారెట్ 44, దొండకాయలు 42, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 70, బరబాటి 46, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50, బద్ద చిక్కుడు 50, దోస కాయలు 20, వె ల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 30, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44,కంద 42, దేముడు చిక్కుడు 98, గోరు చిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర 4, పాల కూర 3, తోటకూర 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్ర పెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	83
లైవ్ ధర	103
విత్ స్కిన్	176
స్కిన్‌లెస్	186



పింఛన్లు అందజేస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్



వేపగుంట బీసీ కాలనీలో లబ్ధిదారునికి పింఛన్ ఇస్తున్న అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, పక్కన పెందుర్తి ఎమ్మెల్యే రమేశ్‌బాబు

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి పాలన

- అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్
- వేపగుంటలో పింఛన్లు పంపిణీ

ఎస్‌ఏడీ జంక్షన్/వేపగుంట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు పాలన సాగిస్తున్నారని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. శుక్రవా రం ఆయన ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబుతో కలిసి 94వ వార్డు వేపగుంట బీసీ కాలనీ దరి భూలోకమాంబ కాలనీలో కొత్త గా మంజూరైన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టేందుకు సీఎం చంద్ర బాబు కృషి చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే రమేశ్ బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిరంకుశ పాలన కొనసాగగా, ప్రస్తుతం ప్రజా పాలన జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్సీ కె. హైమావతి, ఏపీడీ చిరంజీవి, కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు, ము మ్మన దేముడు, జనసేన నాయకురాలు పిన్నింటి పా ర్వతి, కిరణ్, సాలాపు రమణ తదితరులు పాల్గొన్నారు. 93వ వార్డులోని ప్రహ్లాదపు రంలో కార్పొరేటర్ రాపర్తి క న్నా ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ నిర్వహించారు. అలాగే 52వ వార్డులోని కరాసలో ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పింఛన్లు పంపిణీ చేశారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ వెనుకబడిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జోన్ 5 కమిషనర్ బి. రాము, ఏపీడీ కృపానందం, 52వ వార్డు టీడీపీ అధ్యక్షుడు వై. తిరుమలరావు, మార్కెటింగ్ కమిటీ వైస్ ఛైర్మన్ వెంకుమంతి చంద్రశేఖర్, పి. బలభద్రరాజు పాల్గొన్నారు.

గాజువాక : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో సుపరిపాలన నడుస్తోం దని రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస రావు అన్నారు. జీవీఎంసీ 66వ వార్డులో శుక్రవారం నిర్వహించిన 'తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొని నూతనంగా మంజూ రైన పింఛన్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సం దర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరి ంచి, కరపత్రాలను పంపిణీ చేశారు.



కరాసలో పింఛన్ అందిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

పెందుర్తి మండలంలో...

పెందుర్తి/పెందుర్తి రూరల్ : మండలానికి మంజూరైన కొత్త పింఛన్లను నాయకులు ఆయా గ్రామాల్లో పంపిణీ చేశారు. పెందుర్తిలో మేయర్ పీలా శ్రీనివాసరావు, చినముషిడివాడలో కార్పొరేటర్ సేనాపతి వసంత, రాంపురంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు, పురుషోత్తపురంలో టీడీపీ నాయకుడు చీర అప్పలరాజు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. 95వ వార్డులో 33 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. పాపయ్యరాజుపాలెంలో కార్పొరేటరు ముమ్మన దేముడు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

75వ వార్డులో...

పెదగంట్యాడ : జీవీఎంసీ 75వ వార్డులో నూతన లబ్ధిదారులకు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి శుక్రవారం పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే 76వ వార్డులో పెన్షన్లను కార్పొరేటర్ గంధం శ్రీనివాస రావు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం : ప్రజల ఆశాయలకు అనుగుణంగా పథకాలు అమలు చేసే సత్తా కూటమి ప్రభుత్వానికే ఉందని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అన్నారు. వార్డు పరిధిలోని నూతనంగా మంజూరైన పింఛన్‌లను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అగనంపూడి : పేదల సంక్షేమమే కూటమి లక్ష్యమని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. ప్రశాంతినగర్ సచివాలయం పరిధిలో నూతనంగా మంజూరైన పింఛన్లను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. అలాగే 85వ వార్డులో నూతనంగా మంజూరైన పింఛన్లను కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, వార్డు టీడీపీ అధ్యక్షుడు కర్రి దశేంద్ర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం : జీవీఎంసీ 86, 87 వార్డుల్లో పింఛన్లను కార్పొరేటర్లు నల్లూరు సూర్యనారాయణ, బొండా జగన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ కూటమి మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమన్నారు. బొండా జగన్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే కూటమి ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కృష్ణంరాజు



దేనంకొండ కృష్ణంరాజుకు నియామక పత్రం అందిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

ఆటోనగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా 70వ వార్డు ఎల్‌బీ నగర్‌కు చెందిన దేనంకొండ కృష్ణంరాజు నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, బీజేపీ నగర్ అధ్యక్షుడు ఎంఎన్ఎం పరశురామరాజు నియామ క పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తన మీద ఎంతో నమ్మకం ఉంచి ఈ పదవి ఇచ్చినందుకు పీవీఎన్ మాధవ్, పరశురామరాజు, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని కృష్ణంరాజు అన్నారు.

'తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి'

గాజువాక, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్లాంట్‌లో తొలగించిన ఆరు వేల మంది కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకునే విధంగా స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే ఉక్కు యాజమాన్యం మీద ఒత్తిడి తీసుకోవాలని సీఐటీయూ నాయకులు కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో పబ్లిక్ సెక్టార్ కో- ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో సీఐటీయూ నాయకులు గోడ పత్రికను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని, నిర్వాసితులకు న్యాయం చేయాలని, బయోమెట్రిక్‌తో ఆధార్ లింకు ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సత్కారం

అగనంపూడి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఉక్కు కర్మాగారంలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన పలువురి సీడబ్ల్యూసీ ప్రాంగణంలో సర్వహిత చారిటబుల్ ట్రస్టు, ప్రజా సంఘాలు శుక్రవారం ఘనంగా సత్కరించాయి. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధులు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారంలో ఉద్యోగం చేస్తూ అగనంపూడి పరిసర గ్రామాల్లో సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. వారీ సేవలు ఎప్పటికీ మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు, ప్రజా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పీఎఫ్ ఖాతాల్లో తప్పులను సరిచేయాలని నిరసన

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల పీఎఫ్ ఖాతాలో జాయినింగ్ తేదీల నమోదులో జరిగిన తప్పులను సరిచేసి, న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో భెల్ హెచ్‌పీవీపీ ప్రధాన గేటు ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి జీటీపీ ప్రకాశ్ మాట్లాడుతూ 'డేట్ ఆఫ్ జాయినింగ్'లను సరిచేసి కార్మికులకు న్యాయం చేయవల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉన్నదని అన్నారు. దేశంలో అన్ని భెల్ యూనిట్‌లలో అమలువుతున్న 'హయ్యర్ పెన్షన్' విధానాన్ని హెచ్‌పీవీపీ యూనిట్‌లో అమలు చేయాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం శనివారం భెల్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మహాధర్నా చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ పూజలు

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రావన శుక్రవారం సదర్భంగా షీలానగర్ ఎస్‌టీబీఎల్ ప్రాంగణంలోని బాలాజీ దివ్యక్షేత్రంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి మహిళల చేత ప్రత్యేక కుంకుమ పూజలు చేయించారు.

పెదగంట్యాడ : శ్రావణ శుక్రవారం సంద ర్భంగా హౌసింగ్ బోర్డు కాలనీలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, భజన కార్యక్రమాలు నిర్వహించారు.

ఉక్కుటౌన్‌షిప్ : స్టీల్ ప్లాంట్ త్రిశక్తి ఆల యంలో శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామునే ఆలయంలో మహాదుర్గ, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లను విశేషంగా అలంకరించారు.ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అగనంపూడి : స్థానిక ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకు ని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

కూర్మన్నపాలెం : జీవీఎంసీ 86, 87, 88 వార్డుల్లో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని కాశీ అన్నపూర్ణదేవి, మహాలక్ష్మి, దుర్గాలమ్మ, నూ కాలమ్మ, పోలిపిల్లమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లకు దర్శనమిచ్చారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

అలివేలు మంగాదేవికి నక్షత్ర హారతలు

పెందుర్తి : చినముషిడివాడ సప్తగిరినగర్‌లో కొలువై ఉన్న అలివేలు మంగాదేవి ఆలయంలో అమ్మవారికి సహస్రనామార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వెంకటాద్రి శిఖరం దిగువన ఉన్న మహాకామేశ్వరి జ్యోతిర్లింగాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎస్ఆర్‌పురంలో కొలువై ఉన్న దుర్గాదేవి ఆలయంలోనూ పూజలు జరిగాయి.

గోపాలపట్నం : గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని అమ్మవార్ల ఆలయాల్లో శ్రావణ మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నాగేంద్రకాలనీలోని సంతోషిమాత ఆలయం లో జరిగిన పూజలో పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక ప్రశాంతినగర్‌లోని పైడితల్లమ్మ ఆలయం, కొత్తపాలెం పరదేశమ్మ ఆలయం, బాపూజీనగర్, వెంకటాపురం, పద్మనాభనగర్ ప్రాంతాల్లోని అమ్మవార్ల ఆలయాల్లోనూ శ్రావణ మాస పూజలు నిర్వహించారు.



కూర్మన్నపాలెంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

ములగాడలో ప్రత్యేకాధికారి పర్యటన

మల్కాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ పూర్ణమాదేవి శుక్రవారం పలు సచివాలయాలను సందర్శించారు. ఆయా సచివాలయాల పరిధిలో సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులపై ఆరా తీశారు.అలాగే అంగన్‌వాడీ కేంద్రాలను కూడా ఆమె సందర్శించారు.


అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు

గోపాలపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : బిడ్డలకు తల్లి పాలే శ్రేయస్కరమని ఐసీడీఎస్ సీడీపీవో నీలిమ అన్నారు. శుక్రవారం ఎల్లపువానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లి పాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. అప్పుడే పుట్టిన శిశువులకు తల్లి పాలు తాగించడం వల్ల వారిలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. శిశువులకు ఆరు నెలలు వరకూ తల్లి పాలు తాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో శ్రీలత, సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దళిత సంఘాల నిరసన

ఎన్ఏడీ జంక్షన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ పార్క్ మధ్యలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం చేతులను గుర్తు తెలియని వ్యక్తులు విరగ్గొట్టడంతో దళిత సంఘాల నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహం చేతులు విరగ్గొట్టిన ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రిపూట కొందరు యువకులు ఇక్కడ మద్యం సేవిస్తున్నారని వారే ఈ ఘటనకు పాల్పడి ఉంటారని ఆరోపించారు. అనంతరం ఎయిర్ పోర్ట్ సీఐ ఉమామహేశ్వరరావుకు ఫిర్యాదుచేశారు.

వృద్ధుడి నేత్రదానం



పెందుర్తి రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : చింతల అగ్రహారంలో కొరిబిల్లి అప్పారావు (93) శుక్రవారం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న సాయి హెల్పింగ్ హేండ్స్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు దాడి శ్రీను, అప్పారావు కుటుంబ సభ్యులతో మాట్లాడి నేత్ర దానానికి ఒప్పించారు. ఈమేరకు మోషిన్ ఐ బ్యాంక్ వైద్యుల సహకారంతో కార్నియాను సేకరించారు. అప్పారావు చనిపోయినా మరో ఇద్దరికి కంటి చూపు ప్రసాదించడంతో గ్రామస్తులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు కుటుంబ సభ్యులను అభినందించారు.

పెందుర్తి, అరకు రోడ్డు విస్తరణకు సర్వే

పెందుర్తి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి జంక్షన్ నుంచి విజయనగరం జిల్లా కొత్తవలస మీదుగా బౌడారా రహదారి ఎన్‌హెచ్ 516 విస్తరణకు సన్నాహాలు జరుగుతున్నాయి. సుమారు 45 కిలోమీటర్ల మేర ఈ పనులు జరగనున్నాయి.ఈ రహదారికి 516బి నంబరు కేటాయించి నాలుగు లేన్లుగా విస్తరించనుండడంతో శుక్రవారం సరిపల్లి వద్ద సర్వే చేపట్టారు. డీపీఆర్ మ్యాపింగ్ ఆధారంగా సర్వేకు శ్రీకారం చుట్టారు. పెందుర్తి నుంచి సరిపల్లి, జంగాలిపాలెం మీదుగా విజయనగరం జిల్లా చింతలపాలెంలో ఉన్న రహదారికి అనుసంధానం చేస్తూ సర్వే నిర్వహించన్నురు,పెందుర్తి నుంచి విజయనగరం జిల్లా కొత్తవలస, ఎస్. కోట మీదుగా బౌడరా రోడ్డు వద్ద 516ఈ జాతీయ రహదారిని కలిపే విధంగా ఈ రోడ్డును అభివృద్ధి చేయనున్నారు. భూసేకరణ, నిర్వాసితుల పునరావాసం, నిర్మాణానికి రూ935.76 కోట్లు అవుతుందని జాతీయ రహదారి సంస్థ అంచనా వేసింది.2023లోనే ఈ పనులకు ఆమోదం లభించినా ఇప్పవరకు కేవలం రూ 11.81 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ప్రస్తుతం ఈ రహదారిలో రూ. 782 కోట్ల పనులకు ఇటీవల టెండర్ల ప్రక్రియ పూర్తి కావడంతో సర్వే చేపడుతున్నారు.



సరిపల్లి వద్ద రహదారి సర్వే

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష

పెందుర్తి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లిలో వీఎంఆర్‌డీఏ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభం, వీఎంఆర్‌డీఏ నిధులు రూ 76.33 కోట్లతో చేపట్టనున్న వేపగుంట పినగాడి మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులకు ఆదివారం శంకుస్థాపన జరగనుంది. ఈమేరకు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు శుక్రవారం సుజాతనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వేపంగుంట పినగాడి రహదారికి వీఎంఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌లో తొలిదశలో విస్తరణ పనులు చేపడుతున్నామన్నారు. అలాగే నియోజవర్గంలో వీఎంఆర్డీఏ నిధులతో కల్యాణ మండపం నిర్మించామని చెప్పారు. ఆదివారం జరిగే కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. అనంతరం బంగారమ్మపాలేనికి చెందిన మహి ళకు రూ. 2 లక్షల సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

చాకలిపేటలో ఉద్రిక్తత

కార్పొరేటర్ మూర్తి యాదవ్ వేధింపుల నుంచి రక్షించండి అంటూ స్థానికుల ఆందోళన

మద్దిలపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పిఠాపురం కాలనీలో ఉన్న చాకలిపేటలో శుక్రవారం ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దుకాణం తొలగింపును ప్రతిఘటించిన నిర్వాహకురాలు, అందుకు కారణం 22వ వార్డు కార్పొరేటర్ మూర్తి యాదవ్ అని ఆరోపిస్తూ శరీరంపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. అధికారులు, స్థానికులు అప్రమత్తమై ఆమె నిప్పు అంటించుకోకుండా నిలువరించారు.చాకలిపేటలో కనక నిర్వహిస్తున్న దుకాణం, వికలాంగుడు శ్రీనివాసరావు నివాసం ఉంటున్న రేకుల షెడ్డుకు విద్యుత్ కనెక్షన్ తీయడానికి టౌన్‌ప్లానింగ్, విద్యుత్ శాఖ సిబ్బంది శుక్రవారం ఉదయం ఆ ప్రాంతానికి చేరుకున్నారు. 60 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్నామని, కోర్టు ఆర్డర్ కూడా ఉందని సిబ్బందిని నిలదీశారు. కార్పొరేటర్ మూర్తి యాదవ్ కరెంట్ కట్ చేయమన్నారని అధికారులు చెప్పడంతో బాధితులు మండిపడ్డారు. కరెంట్ కట్ చేస్తే ఊరుకోమని భీష్మించారు. అయినా వారు విద్యుత్ కనెక్షన్ కట్ చేసేందుకు ప్రయత్నించగా కనక తన చేతిలోని బాటిల్‌తో ఉన్న పెట్రోల్‌ను తన ఒంటిపై పోసుకుంది. దుకాణం తొలగిస్తే ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించింది. వెంటనే స్థానికుల కనక ఒంటిపై నీరు చల్లారు. అనంతరం మూర్తి యాదవ్ వేధింపుల నుంచి తమను రక్షించాలని కోరుతూ రోడ్డుపై బైఠాయించారు. మూర్తి రావాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్ల నుంచి ఉంటున్న స్థలాన్ని ఖాళీ చేసి, తనకు అప్పజెప్పాలని మూర్తి యాదవ్ బలవంతం చేస్తున్నారని ఆరోపించారు. తాము ఖాళీ చేసేది లేదని చెప్పడంతో టౌన్ ప్లానింగ్, శానిటేషన్, విద్యుత్ శాఖ అధికారులతో బలవంతంగా ఖాళీ చేయడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారని బాధితురాలు కనక కన్నీటి పర్యంతమైంది. అంతలో పోలీసులు,టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మధుసూదనరావు, విద్యుత్ శాఖ డీఈ, ఏఈ అక్కడకు చేరుకున్నారు. రోడ్డుపై బైఠాయించిన మహిళలతో చర్చించారు. కనెక్షన్ తీయమని సర్దిచెప్పారు. కాలువపై అడుగు మేర దుకాణం ఉందని, ఆ మేరకు మాత్రం తొలగిస్తామని నచ్చజెప్పారు. అందుకు వారు అంగీకరించారు. కాసేపటికి మళ్లీ ఏసీపీ బాధితులకు ఫోన్ చేసి దుకాణం మొత్తం తొలగించాలని కార్పొరేటర్ ఒత్తిడి చేస్తున్నారని, దుకాణం మొత్తం తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు సిబ్బంది కనకకు చెందిన దుకాణాన్ని తొలగించారు. బాధితులను రోడ్డున పడేశారు. కోర్టు ఆర్డర్ ఉన్నా దుకాణం తొలగించడం అన్యాయమని, కోర్టుకు వెళ్తామని బాధితులు తెలిపారు.



శరీరంపై పెట్రోల్ పోసుకుంటున్న మహిళ

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

తల్లిపాలు శిశువులకు మేలుచేస్తాయి. బిడ్డ ఎదుగుదలకు అవసరమైన అనేకరకాల పోషకాలు అందిస్తాయి. పుట్టిన వెంటనే నవజాత శిశువుకు ముర్రుపాలను అందిస్తే అనారోగ్య సమస్యలు నుంచి కాపాడే అవకాశం ఉంటుంది. పిల్లలకు తల్లి ఒడి స్వర్గమైతే.. తల్లి పాలు అమృతం. ఇలాంటి అమృతాన్ని బిడ్డలకు ఇవ్వడంలో కొంత మంది తల్లులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రతి చిన్నారికీ తప్పనిసరిగా తల్లిపాలు అందించేలా చేసేందుకు బ్రెస్ట్ ఫీడింగ్ ప్రమోషన్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా ఏటా ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకు తల్లి పాల వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ ఏడాది బిడ్డకు తల్లిపాలను అందించేందుకు ప్రాధాన్యమివ్వడం.. అందుకు అనుగుణమైన వాతావరణాన్ని కల్పించడం అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి దోహదం

- వ్యాధి నిరోధక శక్తి పెరుగుదల
- తల్లుల ఆరోగ్యానికీ మేలు
- బిడ్డ ఎదుగుదలకు మొదటి రెండు రోజులు ఇచ్చే పాలు కీలకం
- జిల్లాలో ప్రారంభమైన తల్లిపాల వారోత్సవాలు

తల్లిపాలలో చిన్నారులకు అవసరమైన పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. పుట్టినప్పటి నుంచి కొన్ని నెలల పాటు తల్లిపాలను అందించాలి. రెండేళ్ల వయసు వచ్చే వరకు తప్పనిసరి. నవజాత శిశువుకు బలవర్ధకమైన ఆహారం తల్లిపాలే. బిడ్డ ఎదుగుదలకు అవసరమైన ప్రొటీన్లు, పోషకాలు, మాంసకృత్తులు, పిండి పదార్థాలు తల్లిపాలలో లభిస్తాయి. చిన్నారులకు తప్పనిసరిగా ఆరు నెలల వరకు తల్లిపాలను మాత్రమే అందించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. శిశువు పుట్టిన వెంటనే ఎదపై పడుకోబెట్టి తల్లి చనుమొన బిడ్డ నోటికి అందించి ముర్రుపాలు తాగించాలి. మొదటి రెండు రోజులు వచ్చే పాలను వైద్య పరిభాషలో కొలస్ట్రామ్ అంటారు. ఇందులో రోగనిరోధక శక్తి అధికంగా ఉంటుంది. పలు రకాల వ్యాధులను నివారించడంలో దోహదపడుతుంది. శిశువు ఆరోగ్యానికి రక్షణ కవచంలా నిలుస్తుంది.

ప్రయోజనాలు ఎన్నో..

తల్లిపాలు తాగే పిల్లల్లో ఊబకాయం, గుండె జబ్బులు, అధిక రక్తపోటు, డయాబెటిస్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుందని అనేక పరిశోధనల్లో తేలింది. పిల్లల్లో రోగనిరోధక శక్తితో పాటు సక్రమంగా ఎదుగుదలకు దోహదం చేస్తుంది. ఎముకల పుష్టి మెరుగ్గా ఉంటుంది. కొన్నిరకాల క్యాన్సర్లను నియంత్రించడంలో కీలకంగా పనిచేస్తుంది. మానసిక రుగ్మతలను దూరం చేసే సామర్థ్యం తల్లిపాల సొంతం.


వారోత్సవాల్లో భాగంగా నిర్వహించే అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్ పీడీ, ఇతర అధికారులు

పాలిచ్చే తల్లికీ మేలు..

బిడ్డ పాలు తాగడం వల్ల తల్లి ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. కాన్పు తరువాత వచ్చే కొన్నిరకాల మానసిక సమస్యలు దూరమవుతాయి. పాలిచ్చే స్త్రీలలో రొమ్ము, అండాశయ క్యాన్సర్ ముప్పు తక్కువగా ఉంటుందని అధ్యయనాల్లో తేలింది. పాలిచ్చే తల్లులు రోజుకు అదనంగా 400 కేలరీలనిచ్చే ఆహారం తీసుకోవాలి.

పోషకాలు మెండు..

తల్లి పాలలో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. 100 మిల్లీలీటర్ల పాలలో 1.5 గ్రాముల ప్రొటీన్లు, 650 మి.లీ పాలలో 300 మైక్రో గ్రాముల విటమిన్ ఏ, 0.25 నుంచి 0.3 మైక్రో గ్రాముల విటమిన్ బి, 700 మిల్లీలీటర్ల పాలలో మూడు మిల్లీ గ్రాముల ఐరన్ ఉంటుంది. ప్రసవం తరువాత బాలింతలు పోషకాహారం తీసుకోవాలి. ప్రతిరోజూ 600 గ్రాముల అన్నం, 200 గ్రాముల పప్పు, 150 గ్రాముల కూరలు, ఉడకబెట్టిన గుడ్డు, ఓ పండు, 100 మిల్లీలీటర్లు పాలు తీసుకోవాలి.



అవగాహన కల్పిస్తున్నాం



బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు అందించాలి. ఈ విషయంలో నిర్లక్ష్యం కూడదు. దీనిపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించేందుకే వారోత్సవాలు. ఆపరేషన్, ఇతర కారణాలు, అపోహలతో చాలామంది తల్లిపాలను ఇవ్వడం లేదు. ఇది బిడ్డ ఆరోగ్యానికి ఇబ్బందిగా పరిణమిస్తుంది. ఆరు నెలలపాటు కేవలం తల్లి పాలను అందించడం మేలు. దీనివల్ల తల్లి ఆరోగ్యానికీ మేలు జరుగుతుంది.

\- కేవీ రామలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ

అపోహలు విడనాడాలి

బిడ్డ పుట్టిన తరువాత కొందరు తల్లులు అపోహలతో బిడ్డకు పాలివ్వడం లేదు. దీనివల్ల చిన్నారుల ఆరోగ్యాన్ని బలి చేసినట్టేనని నిపుణులు చెబుతున్నారు. పాలు జిగటగా ఉంటాయని, బిడ్డ గొంతులోకి దిగవని భావిస్తుంటారు. మొదటిసారి తల్లి స్థనాల నుంచి వచ్చే పాలను గట్టిగా పీల్చాల్సి ఉంటుందన్న భావనతో కొందరు ఇవ్వడం లేదు. తల్లికి శస్త్ర చికిత్స జరిగితే ఆమె మత్తులో ఉండగా పాలు ఇవ్వకూడదన్న భావనతో కొందరు దూరంగా ఉంచుతుంటారు. వైద్యుల సలహా మేరకు పుట్టిన వెంటనే పిల్లలకు తల్లిపాలు అందించాలి.

వారోత్సవాల్లో కార్యక్రమాలు..

తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పిస్తారు. జిల్లా, నియోజకవర్గ, మండల, అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలు, మహిళలకు తల్లి పాలతో కలిగే మేలు వివరిస్తారు.

నేషనల్ కోస్ట్‌గార్డ్ సెక్యూరిటీ సెమినార్


నేషనల్ కోస్ట్‌గార్డ్ సెక్యూరిటీ సెమినార్‌లో పాల్గొన్న ఉన్నతాధికారులు

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ కోస్ట్‌గార్డ్ శుక్రవారం తూర్పు తీర ప్రధాన కార్యాలయంలో నేషనల్ కోస్టల్ సెక్యూరిటీ అంశంపై సెమినార్ నిర్వహించింది. ఇండియన్ కోస్ట్‌గార్డ్ అడిషనల్ డీజీ డోన్నీ మిచేల్ పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో జరిగే ఈ సెమినార్‌కు బోర్డర్ మేనేజ్‌మెంట్ కార్యదర్శి డాక్టర్ రాజేంద్రకుమార్ అధ్యక్షత వహించారు. తీర రక్షణలో మరింత భద్రత, ఆధునిక టెక్నాలజీ వినియోగం, అంతర్గత సమన్వయం అంశాలపై చర్చజరిగింది. జాతీయ స్థాయిలో కోస్టల్ సెక్యూరిటీకి ఉన్న మెకానిజం, ఎదురవుతున్న సవాళ్లు వాటిని అధిగమించే విధానాలు వంటి వాటిని ఉన్నతాధికారులు వివరించారు. ఇంటెలిజెన్స్ బ్యూరో, కస్టమ్స్, ఎన్‌సీబీ, కోస్టల్ సెక్యూరిటీ, వివిధ రాష్ట్రాల పోలీస్, పోర్టుల అధికారులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

యువత నైపుణ్యాభివృద్ధి శిక్షణకు కృషి

ద్వారకాబస్‌స్టేషన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): యువత నైపుణ్యాభివృద్ధికి శిక్షణ అందించి ఉపాధి కల్పించే దిశగా ఎల్‌జీ ఇండియా సీఎస్ఆర్ ఫౌండేషన్ ముందడుగు వేసింది. ఈ మేరకు హెచ్‌పీసీఎల్ నైపుణ్యాభివృద్ధి సంస్థతో ఎల్‌జీ ఇండియా సీఎస్ఆర్ ఫౌండేషన్ శుక్రవారం అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఎల్‌జీ ఇండియా సీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ గిరిజా శంకర్, గ్లోబల్ హెడ్ పాల్‌క్వాన్, డైరెక్టర్ సీకే జియాంగ్, హెచ్‌పీసీఎల్ నైపుణ్యాభివృద్ధి సంస్థ సీఈఓ ఇంతియాజ్ అర్షద్‌లు ఒప్పందం పై సంతకాలు చేశారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ అందించేలా ఉమ్మడి ప్రణాళిక రూపొందిస్తామని వెల్లడించారు. నైపుణ్య శిక్షణకు అయ్యే ఖర్చును ఎల్‌జీ ఇండియా సంస్థ భరిస్తుందని సంస్థ ఫౌండేషన్ చైర్మన్ గిరిజా శంకర్ పేర్కొన్నారు. ఈ ఏడాది అక్టోబరు నుంచి అధికారికంగా శిక్షణ ప్రారంభమవుతుందన్నారు.

యువతకు ప్రేరణ ఈ హోం గార్డు

- 40 ఏళ్ల వయసులో యువతతో పోటీపడి కానిస్టేబుల్ ఉద్యోగం


పిళ్లా వెంకట బాలాజీ

మహారాణిపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన పిళ్లా వెంకట బాలాజీ వయసు 40 ఏళ్లు. తన కన్నా 20 సంవత్సరాల తక్కువ వయసున్న యువతతో పోటీ పడి ప్రతిభతో విశాఖ సిటీ సివిల్ పోలీస్‌గా ఎంపికై యువతకు ప్రేరణగా నిలిచాడు. నగరంలో 2016లో హోంగార్డుగా చేరిన బాలాజీ తొమ్మిదేళ్లుగా ఐటీ కోర్ విభాగంలో విధులు నిర్వహిస్తు న్నాడు. ఇటీవల నిర్వహించిన కానిస్టేబుల్ ఉద్యోగాల పరీక్షలో యువతతో పోటీపడ్డాడు. 6 నిమిషాలలో 1,600 మీటర్ల దూరం పరిగెత్తడమేకాక, మరో మూడు విభాగాలలో ఉత్తమ మార్కులు సాధించాడు. హోమ్‌గార్డుగా చేసిన అనుభవంతో కానిస్టేబుల్ ఉద్యోగం సంపాదించకుండా, పోటీపడి అనుకున్నది సాధించి యువతకు ప్రేరణగా నిలిచాడు. సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన గరిష్ఠ వయసు గల అభ్యర్థి కూడా వెంకట బాలాజీ కావడం విశేషం.

వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్ నిర్మాణానికి స్థల పరిశీలన

- మధురవాడ, ముడసర్లోవ, గాజువాక ప్రాంతాల్లో ఏర్పాటుకు ప్రతిపాదనలు


పైనాపిల్ కాలనీలో మాట్లాడుతున్న కమిషనర్

ఆరిలోవ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్ర భుత్వ నిధులతో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశామని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ముడసర్లోవ పైనాపిల్ కాలనీ, కొమ్మాది యూనియన్ బ్యాంకు వెనుక స్థలాలను అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. మూడు వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్ నిర్మాణానికి కేంద్రం నిధులు సమకూర్చిందన్నారు. వీటిని మధురవాడ, ముడసర్లోవ, గాజువాక ప్రాంతాల్లో నిర్మిస్తామని, ఇందుకోసం స్థల సేకరణ చేస్తున్నామన్నారు. స్మార్ట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్మాణం చేపడతామని, పైనాపిల్ కాలనీలో ఎంతమంది ఉన్నారో ప్రాంగణాధికారి విమలను అడిగి తెలుసుకున్నారు. భవన నిర్మాణానికి స్థలం, నిర్మాణ నమూనా తదితర అంశాలను కమిషనర్‌కు ఇంజనీరింగ్ అధికారులు వివరించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్-2కనక మహాలక్ష్మి, పర్యవేక్షణ ఇంజనీరు కేవీఎన్ రవి, డీసీపీ హరిదాస్, సర్వేయర్ ప్రభాకర్, స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ మేనేజర్ ఆనంద్, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ జిల్లా మేనేజర్ విమల, హాస్టల్ వార్డెన్ ఎంఎస్ లక్ష్మి పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

- సర్వే సెటిల్‌మెంట్ అడిషనల్ డైరెక్టర్ గోవిందరావు

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన బాధ్యతతోపాటు భూ సంబంధ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్సు అడిషనల్ డైరెక్టర్ రోణంకి గోవిందరావు అన్నారు. కలెక్టరేట్‌లో జేసీ మయూర్ అశోక్‌తో కలిసి ఆయన శుక్రవారం అధికారులతో సమీక్షించారు. భూముల రీసర్వే పనులు వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. వివాదాలు లేని ప్రభుత్వ భూముల ఆక్రమణల క్రమబద్ధీకరణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, సర్వే శాఖ ఏడీ సూర్యారావు, తహసీల్దార్లు, డీటీలు పాల్గొన్నారు.

138 ఏళ్ల మహావృక్షానికి రాఖీ


దొండపర్తి రైల్వే గెస్ట్‌హౌస్ వద్ద మర్రి వృక్షానికి రాఖీ కడుతున్న గ్రీన్ క్లైమేట్ ప్రతినిధులు


రాఖీతో వీఎంఆర్‌డీఏ కమిషనర్

అక్కయ్యపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మహావృక్షాల పరిరక్షణ కోసం రాఖీ కట్టాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ పిలుపునిచ్చారు. దొండపర్తి రైల్వే గెస్ట్‌హౌస్ దగ్గర ఉన్న 138 ఏళ్ల మహామర్రి వృక్షానికి గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో నేతృత్వంలో శుక్రవారం సెయింట్ జోసెఫ్ కళాశాల, లిటిల్ ఏంజెల్స్ విద్యార్థినులతో రాఖీ కట్టి పూజించారు. మహావృక్షానికి రాఖీ కట్టి పర్యావరణ పరిరక్షణ బాధ్యతను గుర్తు చేస్తున్నామన్నారు. 25 ఏళ్లుగా గ్రీన్ క్లైమేట్ టీం మహావృక్షానికి పవిత్ర దారాలు కట్టి సంప్రదాయంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికశాఖ సహాయ కమిషనర్ మోహన లక్ష్మి, పోర్టు ఉద్యానవన శాఖ అధికారిణి రాధిక, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, కో-ఆర్డినేటర్ జె.రాజేశ్వరి, వనమాలి సిటీ అడ్మిన్ మళ్ళ సరిత తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


రమణ (ఫైల్)

కంచరపాలెం/రావికమతం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ఐటీఐ జంక్షన్ వద్ద వాటర్ సర్వీసింగ్ కేంద్రంలో పనిచేస్తున్న భీమరాతి రమణ (41) శుక్రవారం విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. అనకాపల్లి జిల్లా రావికమతం మండలం కొత్తకోటకి చెందిన రమణ సిద్ధార్థనగర్‌లో కుటుంబంతో నివసిస్తున్నాడు. కంచుమాంబ వాటర్ సర్వీసింగ్ కేంద్రంలో పనిచేస్తున్నాడు. ఉదయం 8 గంటల ప్రాంతంలో కారు సర్వీస్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. సీఐ రవికుమార్, ఎస్ఐ రవికుమార్‌లు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. రమణకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. పదేళ్ల కిందట నగరానికి వచ్చి ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులు చేసేవాడు. రెండేళ్లుగా వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. భర్త మృతిచెందడంతో భార్య సత్యవతి, కుమారులు జశ్వంత్, సుశ్రిత్ గుండెలవిసేలా రోదిస్తున్నారు.

గడ్డి మందు సేవించి వ్యక్తి మృతి

ఆనందపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గడ్డి మందు సేవించి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన బీపీవీ కళ్లాల వద్ద జరిగింది. సీఐ చింతా వాసునాయుడు తెలిపిన వివరాల మేరకు ఈ ప్రాంతానికి చెందిన ముదపాక అచ్చిబాబు (35)కు పెళ్లై ముగ్గురు పిల్లలున్నారు. గత నెల 29వ తేదీ రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. భార్య భవానీ, చుట్టుప్రక్కల వారు మందలించడంతో కోపంతో ఇంటికి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో వెతగ్గా ఒక తోటలో పడి ఉన్నాడు. ఇంటికి తీసుకువచ్చిన తరువాత వాంతులు చేసుకున్నాడు. పురుగుల మందు వాసన రావడంతో కేజీహెచ్ తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

తీరంలో గుర్తుతెలియని మృతదేహం



ఆరిలోవ, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): జోడుగుళ్లపాలెం సముద్ర తీరానికి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకొచ్చినట్టు ఆరిలోవ ఎస్ఐ వై.కృష్ణ తెలిపారు. మృతిడి చేతిపై జగదీశ్, పొట్టపై అమ్మ అని పచ్చబొట్లు ఉన్నాయన్నారు. వివరాలు తెలిసిన వారు పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

మోసం చేసిన ముద్దాయికి మూడేళ్ల జైలు

కూర్మన్నపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని మహిళకు విక్రయించి మోసం చేసిన ముద్దాయికి న్యాయస్థానం మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించింది. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మంగళపాలేనికి చెందిన తోటకూర శ్రీదేవి 2014లో టి.వెంకట సుబ్బారెడ్డి వద్ద 300 గజాల స్థలం రిజిస్ట్రేషన్ చేసుకుంది. అయితే ఆ స్థలం ప్రభుత్వానికి సంబంధించిన కాలనీ రహదారి అని తేలింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. నేరం రుజువు కావడంతో ముద్దాయి టి.వెంకటసుబ్బారెడ్డికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారని సీఐ కె.మల్లేశ్వరరావు తెలిపారు.

కలెక్టరేట్ ఏవోగా బీవీ రాణి

విశాఖపట్నం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ పాలనాధికారిగా మెజిస్టీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్ బీవీ రాణికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడి ఏవో కేవీఈశ్వరరావు గురువారం పదవీ విరమణ తాత్కాలికంగా ఆమెకు బాధ్యతలు అప్పగించారు. విశాఖ ఆర్డీవో కార్యాలయ పరిధిలో భూసేకరణ ప్రత్యేక తహసీల్దారుగా భూపరిరక్షణ విభాగం తహసీల్దారు గురుమూర్తి, భీమిలి ఆర్డీవో కార్యాలయ ఏవోగా అక్కడే పనిచేస్తున్న సుధాకర్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలో మూడు తహసీల్దారు పోస్టులకు ఖాళీ అవడంతో ముగ్గురిని కేటాయించాలని భూపరిపాలనా ముఖ్య కమిషనర్‌కు కలెక్టర్ లేఖ రాశారు.

విద్యార్థి ప్రతిభతోనే పరీక్షల్లో ఉత్తీర్ణత

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతిభతోనే విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తారని ఏయూ పరీక్ష విభాగ డీన్లు ప్రొఫెసర్ జి.నానాజీ రావు, ప్రొఫెసర్ బి.మునిస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు స్పెషల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తున్నామని, దీనికి ప్రత్యేక రుసుము చెల్లిస్తారన్నారు. ఫీజు చెల్లించిన ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలనే నియమం లేదని స్పష్టం చేశారు. కొంతమంది విద్యార్థులు తాము ప్రత్యేకంగా ఫీజు చెల్లించామని, పరీక్షల్లో ఉత్తీర్ణులను చేయాలని డిమాండ్ చేయడం అనైతికమన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో చూపిన ప్రతిభ, ప్రశ్నలకు రాసిన జవాబుల ఆధారంగానే మూల్యాంకనం జరుగుతుందని, దానిపైనే ఫలితాలు ఆధారపడి ఉంటాయన్నారు. మూల్యాంకనం పటిష్ఠంగా ఉంటుందని, మెరుగైన ప్రతిభ చూపిస్తేనే ఉత్తీర్ణత సాధిస్తారన్నారు. దీర్ఘకాలంగా కొన్ని సబ్జెక్టుల్లో తప్పిన విద్యార్థుల అభ్యర్థనను పరిశీలించి మానవతా దృక్పథంతో స్పెషల్ ఎగ్జామినేషన్ నిర్వహించామన్నారు.

ఉత్తమ సేవలందించిన వారికే గుర్తింపు

- ఆర్టీసీ చైర్మన్ కొనకల్ల నారాయణ


ఉద్యోగ విరమణ చేసిన వారిని సత్కరిస్తున్న నారాయణ

ద్వారకాబస్‌స్టేషన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని ఆర్టీసీ చైర్మన్ కొనకల్ల నారాయణ అన్నారు. ఆర్టీసీలో ఉద్యోగ విరమణ చేసిన ముగ్గురు అధికారులను శుక్రవారం ఆయన సత్కరించారు. ఎంవీపీకాలనీ బస్‌స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఉద్యోగులు సీనియర్ల నుంచి మెలకువలు తెలుసుకోవాలన్నారు. ఈనెల 15నుంచి ప్రారంభమయ్యే మహిళలకు ఉచిత బస్సుపథకం విజయవంతంగా నిర్వహించాలన్నారు. సంసను ప్రగతిదిశగా నడిపేందుకు సమష్టిగా పనిచేయాలన్నారు. విజయనగరం జోన్ ఈడీ కేఎస్‌బీ రెడ్డి, విశాఖ ఆర్ఎం అప్పలనాయుడు, అనకాపల్లి జిల్లా ప్రజారవాణాధికారి వి.ప్రవీణ, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.